అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక పత్రిక


ప్రపత్తి

# శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాస పత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 03 మే 2024 పేజీలు:36 వెల:30





# ముఖచిత్రపరిచయం

శ్రీరామాయణ ప్రమాణాలను యథాతథంగా వాస్తవిక రూపంగా మన ముందు ఎందరో ఆవిష్కరిస్తున్నారు. కొందరు మాత్రమే అభూత కల్పనల వైపు తమ ప్రవచనాలు వెళ్లకుండా భక్తులను రంజింపజేస్తూ ఆధ్యాత్మిక భావనలను పరిఢవిల్లేలా అనునిత్యం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు శ్రీరామాయణ పారాయణ హవన కార్యక్రమాలను నిర్వహిస్తూ, శ్రీరామాయణంలోని అమూల్య ఘట్టాలను కరీంనగర్ పట్టణంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు ప్రవచించారు. భక్తిమార్గంలో సమాజాన్ని నడిపించే విధంగా రామాయణంలోని ముఖ్యఘట్టాలు ఆవిష్కరించారు. "రామో విగ్రహవాన్ ధర్మః" రాముడు ధర్మ స్వరూపం. వారి నడవడికే ఆదర్శం అనే అర్థంలోనే వాల్మీకి మహర్షి ఎన్నో ధర్మసూక్ష్మాలను తెలియపరిచారు. కాలగమనంలో ఎందరో శ్రీరామాయణాన్ని తమకు అనుకూలంగా రచించారు. రామ కథ అంటే వాల్మీకి విరచిత శ్రీరామాయణమే. వాల్మీకి రామాయణంలోని అంశాలు పక్కదారిపట్టకుండా వాస్తవాన్ని గమనించాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు ఉద్బోధించారు. స్వామివారి ప్రవచనామృతాన్ని ఆస్వాదించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసారు. ఉదయం సాయంత్రం వేళలో జరిగిన ప్రవచనగోష్ఠిని ఆస్వాదించారు. వసంత నవరాత్రోత్సవముల వేదిక నేటి ముఖచిత్రం.

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:

prapatti.srisannidhanam9@gmail.com

మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్:

9502583323

(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)

## సంప్రదించండి

పాఠకుల సందేహాలు, సమాధానాలు జ్యోతిష్య శాస్త్ర విశేషాల కొరకు వెంటనే సంప్రదించండి.

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**

**మీసందేహాలను నివృత్తి చేసుకోండి!!**

**-మేనేజింగ్ ఎడిటర్**

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

– ఎడిటర్

ప్రపత్తి శ్రీసన్నిధానం

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 2 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి మే 2024 వెల : 30

## ఇందులో

3. ముఖచిత్రపరిచయం
4. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి
5. నెలవారి పంచాంగం
6. శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద
8. వృషభంలో వైశాఖ మాస విశిష్టత (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
11. శ్రీపతిస్తుతి- శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనర్సింహాచార్యులు
12. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాంతి
13. వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణం, భూ వైకుంఠము భద్రాద్రి-శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
14. భాగవతంలో భగవంతుని కథలు
శ్రీమతి తిరుమల నీరజ
16. సత్సంప్రదాయ సేవలో రామానుజ సిద్ధాంతసభ
18. అంతా నృసింహమయమే
శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు
19. ఋషిపత్ని పరిపూర్ణ భక్తి
శ్రీమతి మహాలక్ష్మి రాణి గుండు
20. రామాయణ మహాక్రతువు, సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవ ఆహ్వానాలు.
22. జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
23. ధర్మసంస్థాపనం-కైంకర్య వ్యవస్థ
శ్రీమతి వంగల రాధిక
25. శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి
27. అవయవ విభూతి
శ్రీమతి కొడకళ్ళ పద్మజ జోతిర్మయి
28. పుస్తక పరిచయం
29. మహానుభావుల చరితలో మధురఘట్టాలు
శ్రీమాన్ నెల్లుట్ల దత్తాత్రేయ స్వామి
31. కరీంనగర్‌లో వసంత నవరాత్రోత్సవములు
మన దేవాలయాలు, బాల విజ్ఞానం, శ్రీసన్నిధిపదకేళీ ఆధ్యాత్మిక వార్తలు

**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

# రామరాజ్య స్థాపనే లక్ష్యంగా అడుగులు వేయాలి



సనాతన సంప్రదాయ పరిరక్షణ కోసం సమస్త భారతావని జరిపే ఈ జీవన ప్రయాణంలో ప్రస్తుతం వేసే ఒక్కో అడుగు విజయానికి సంకేతం. ఇది ఆరంభమే కానీ అవరోధం కానేరదు. అనుక్షణం జిజ్ఞాసులైన మేధావులు మనకు అందిస్తున్న విజ్ఞాన పరంపరలో మనం సాధిస్తున్న ప్రగతికి ఇది సోపానం అవుతుందనడంలో అతిశయోక్తి లేదు. మానవమేధ వికసిస్తున్న కొలది అనుక్షణం అజ్ఞానంతో విజ్ఞానం పోరాటం జరుపుతూనే ఉంది. అంతిమ విజయం సత్యానిదే ధర్మ నిష్ఠదే అన్నది జగద్విదితం, గీతా సారం కూడా. ఎన్ని లాభాలు వస్తున్నప్పటికినీ తప్పుచేయకుండా ఉందాం, ఏలాభమూ లేకున్నా మంచి చేసే ప్రయత్నం చేస్తూ ఉందాం. ఈ భావాన్ని మనలో ఇమిడిపోయేలా శ్రీమద్భగవద్గీత ఒకటవ అధ్యాయం అర్జున విషాదయోగం 35 శ్లోకం చెబుతుంది. వాస్తవికతను పక్కకు పెట్టేలా ప్రలోభాల ఎరపెట్టి సాగుతున్న వ్యూహాలకు మనం ఒక్క క్షణం విజ్ఞతతో ఆలోచించి భారతావని ముందడుగు వేయాల్సిన తరుణం ఇది. వ్యక్తిగత ప్రయోజనాలు తాత్కాలికమే, సమాజ ప్రయోజనమే శాశ్వతం అన్న చాణక్య సూత్రాన్ని మననం చేసుకోవాలి. మనం ఒక్కరమే ఏమి చేయగలం అనే భావన వీడి ముందుకు వెళితే సంఘటితంగా, సంఘటిత శక్తిగా ఎదగడానికీ, కదలడానికి అవకాశం కలుగుతుంది. మంచికి చెడుకూ అనాదిగా అనునిత్యం సంఘర్షణ జరుగుతూనే ఉంది. కానీ అంతిమ విజయం సత్యానిదే! మానసిక సంఘర్షణలో వాస్తవికతకు మధ్య ఆధ్యాత్మిక భావన పెనవేసుకున్న వేళ జ్ఞాన జ్యోతి వెలుగురేఖలు చూడగలమన్న నమ్మకంతో ముందుకు వెళ్ళాలి. ఈ శతాబ్దంలో ఎన్నో అద్భుతాలు, మరెన్నో త్యాగాలు వీటన్నిటినీ మరుగున వేయడానికి మసిపూసి మారేడుకాయ చేసారు. వాస్తవాన్ని మరుగునపెడుతూ అవాస్తవాన్ని ఇదీ అసలైన వాస్తవం అంటూ ముందుంచారు. కానీ సత్యం నిప్పువంటిది. అసత్యాన్ని దహించి వాస్తవాన్ని మనముందు ఆవిష్కరించింది. ఇప్పటికైనా జాగృతం కావాలి. మనధర్మశాస్త్రాలు, పురాణాలు వాస్తవాలంటూ ఎన్నో ఆధారాలు మన కనుల ముందు కనిపిస్తున్నా, విదేశీయులు తిరగరాసిన చరిత్ర ప్రమాణాలముందు నిలువలేక పోతున్నది వాస్తవమే, కానీ ఇప్పటికీ మనకు ఆధారాలుగా లభిస్తున్న పురాణాలు, తాళపత్రగ్రంథాలను శోధించాలి. వాస్తవికతకు అద్దంపట్టే ప్రాచీన చరిత్ర ప్రమాణాల మూలవేర్లను కనిపెట్టాలి. సంస్కరణ దాడికి వ్యతిరేకంగా సంప్రదాయాన్ని కాపాడేందుకు చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ కొన్ని పరిస్థితులు ప్రతిబంధకంగా తయారు అవుతున్నాయి. ఆధునిక యుగంలో ఉత్తమమైన వాటికి మినహాయింపులు ఇవ్వాలన్న వాదన కూడా వినపడింది. కానీ ముందుగా సనాతన సంప్రదాయ పరిరక్షణ దిశగా సంస్కరణలు జరగాలి. ఇక్కడ మనం గమనించాల్సినది సనాతన ధర్మము అంటే శాశ్వతమైనది అంటున్నప్పుడు చరిత్రను కథలుగా తిరగరాసిన చందంకాకుండా జాగ్రత్తపడాలి. ఇందుకోసం సంప్రదాయ సిరులను అందిస్తున్న మేధావులు కూడా ఆలోచించాలి. భారత జాతి గౌరవానికి భగ్నం కలుగకుండా చూడాలి. సనాతన ధర్మంలో నిజాయితీ, ప్రాణులకు హాని కలిగించకుండా ఉండటం, స్వచ్ఛత, సద్భావన, దయ, సహనం, స్వీయ నిగ్రహం, ఔదార్యం మరియు సన్యాసం వంటి సద్గుణాలు ఉంటాయి. సనాతన ధర్మం స్వధర్మంతో విభేదిస్తుంది. ఇది శ్రీరామాయణంలో మనకు అడుగడుగునా కనిపిస్తుంది. అలా చాణుక్యుని నీతి శాస్త్రంలో కూడా కనిపిస్తుంది. ప్రస్తుతం మనముందు కనిపిస్తున్నది, ధర్మపరివర్తనతో నిలబడే అవకాశం కలిగేది కొన్ని సందర్భాలలోనే ఆ అవకాశం కలిగినప్పుడు సరైన మార్గాన్ని ఎంచుకోవాలి. భవిష్యత్తుకోసం బాటలు వేయాలి. చరిత్రను తిరగరాయాలి. సత్యనిష్ఠ, ధర్మనిరతి, ఆధ్యాత్మిక భావనలు దశదిశలా వ్యాపించేలా ప్రతిఒక్కరూ ప్రయత్నించాలి. జాతిఔన్నత్యానికి బాటలు వేయాలి. భారత జాతి మనుగడకోసం, సనాతన సంప్రదాయ పరిరక్షణకోసం ఆదర్శాలను అడుగడుగునా ఆచరిస్తున్నవారు కొందరు. ఆదర్శాలను పైపైకి వల్లెవేసేవారు మరి కొందరు. సమాజఉన్నతిని కాంక్షించేవారిని గుర్తించి వారి వెంట నడవటం తప్పనిసరి. సెక్యులర్ ముసుగులో సనాతన ధర్మానికి వక్రభాష్యం చెప్పేవారు మానవత్వ విలువలను కాలరాస్తున్నారన్న సత్యాన్ని గ్రహించాలి. భారత జాతి ఔన్నత్యాన్ని గుర్తించి విదేశాలలో ఉన్న ప్రవాస భారతీయులు కూడా దేశ ఉన్నతిని కాంక్షిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మనమెందుకు జాగృతం కావద్దు. వాస్తవాన్ని పక్కన పెట్టే అంశాల జోలికి వెళ్లకుండా ప్రస్తుతం ధర్మాన్ని పరిరక్షించాల్సిన తరుణమిది. శ్రీరామరాజ్యస్థాపనే లక్ష్యంగా సాగాలి.

–పొద్దుపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

వైశాఖ మాసం 09-05-24 శుక్లపక్షంతో ప్రారంభమై 06-05-24 వరకు, తదుపరి 07-06-24 నుండి జ్యేష్ఠ మాసం

10-05-24 వరకు భరణి కార్తి, 11-05-2024 నుండి 24-05-24 వరకు కృత్తిక కార్తి, 25-05-24 నుండి రోహిణి కార్తి.

**పండుగలు** : 02-05-24 నర్మదా నది పుష్కరారంభం, 04-05-24 సర్వేషాం ఏకాదశి, 10-05-24 అక్షయతృతీయ, శ్రీపరశురామ జయంతి, 12-05-24 శ్రీరామానుజ జయంతి, శ్రీ ఆదిశంకరాచార్య జయంతి, 19-05-24 సర్వేషాం ఏకాదశి, 21-05-24 (స్మార్త) 22-05-24 (శ్రీవైష్ణవ) శ్రీనృసింహ జయంతి,22-05-24 నమ్మాళ్వార్ తిరునక్షత్రము, 24-05-24 పరాశరభట్టర్ తిరునక్షత్రము.

## మాస ఫలాలు



**మేషం:** ఈ నెల ఆర్థికసమస్యల వలన ఇబ్బందులు. చిన్నచిన్న సమస్యలు వచ్చి వెంటనే సమసిపోవును. ఆరోగ్యం బాగుంటుంది. పనులు ఆలస్యం.



**వృషభం:** ఈ నెల ఆదాయంనకు మించిన ఖర్చులు, ఆరోగ్య భంగములు, నేత్ర శిరోపీడలు, ప్రయాణములు అవమానములు అపనిందలు తప్పవు.



**మిథునం:** ఈ నెల బాగుంటుంది. కొన్ని సమస్యలు పరిష్కార మగును. ద్వితీయార్ధంలో ఊహించని సంఘటనలు, ఆదాయంనకు మించిన ఖర్చులు,



**కర్కాటకం:** చేయువృత్తి వ్యాపారాలందు అనుకూలత, అనుకున్న పనులు సరైన సమయానికి పూర్తిచేస్తారు. శతృవులపై ఆధిక్యత. ప్రయాణాలందు ఇబ్బందులు.



**సింహం:** అన్నిరంగాలవార్కి బాగుంటుంది. ఉత్సాహంగా ధైర్యంతో ముందుకు పోగలరు. సంతాన, వాహనసౌఖ్యం, బంధుమిత్రాదులతో సఖ్యత



**కన్య:** ఈ నెల కొంత బాగుండును. అన్నిరకములుగా నష్టములే. ద్వితీయార్ధంలో చేయు వృత్తివ్యాపారాలు రాణించును. ఆదాయం బాగుండును. గతంలో ఉన్న సమస్యల నుండి బయటపడుదురు.



**తుల:** ఈ నెల అనుకూలం. కార్యాలు సకాలంలో పూర్తి చేయగలరు. సంతానసౌఖ్యం, కుటుంబ సౌఖ్యం. వాహనలాభాలు, వివాహాది శుభకార్యాలకు హాజరగుట,



**వృశ్చికం:** చేయు వృత్తి వ్యాపారాలందు అన్నిరంగాల వారికి లాభదాయకమే. ఆరోగ్యం బాగుంటుంది.. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి నిచ్చును. ప్రతీ విషయంలో ధైర్యంతో ముందుకు పోగలరు.



**ధనుస్సు:** ఆర్థికంగా బాగుండును. అనుకున్న పనులు సాధించెదరు. గృహంలో వివాహాది శుభకార్యములు, బంధుమిత్రులతో కలయిక సమస్యలనుండి బయటకు వస్తారు. ప్రయాణలాభాలు,



**మకరం:** చేయువృత్తి వ్యాపారాలందు అనుకూలత, ఆరోగ్యం బాగుండును. ఆర్థిక సమస్యలు సంతృప్తి. మిత్రులతో కలయిక. వివాహాది శుభకార్యాలు జరుగును.



**కుంభం:** ఈనెల మీ మాటకు తిరుగుండదు. చేయువృత్తి వ్యాపారాలందు అనుకూలత. కుటుంబ సౌఖ్యం, వివాహాది శుభకార్యములకు హాజరగుట,



**మీనం:** గ్రహ సంచారం అనుకూలించును. చేయు పనులందు రాణింపు. గౌరవం పెరుగును. వివాహాది కార్యములకు హాజరగుట, ఆర్థిక సంతృప్తి. ఆరోగ్యం బాగుండును. వ్యవహారాలు అనుకూలంగా సిద్ధించును.

గురుమౌఢ్యమి 04-05-24 నుండి 03-06-24 వరకు
శుక్రమౌఢ్యమి 29-04-24 నుండి 10-07-24 వరకు

శ్రీక్రోధి నామ సంవత్సరంలో భారతదేశ భూభాగంలో గ్రహణములు కనబడవు కావున ఏ నియమాలు పాటించనవసరం లేదు.

## మంచి రోజులివిగో...

ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ **ముహూర్తములు లేవు. కూపాలకు ముహూర్తాలు కలవు.**

# శ్రీరామానుజ సుధామాధురి

## కాంతిరేఖలు దిద్దు కరుణామూర్తి



**– శ్రీమతి సముద్రాల శారద**

సత్పురుషుల కటాక్షము సామీప్యము మానసిక శుద్ధిని కలగజేస్తుంది. కోవెలలోని దైవదర్శనం ఏ విధంగా మనశ్శాంతిని కలిగిస్తుందో అలాగే మహనీయుల దర్శనం, భాషణం ఒక శుభాన్ని కలిగిస్తుందని అనుభవ పూర్వకంగా నమ్ముతారు. వారు లోకహితులు వేదవేత్తలు అయితే వారిచ్చే సూచనలు బోధనలు సామాజికులను సన్మార్గంలోకి నడిపిస్తాయి. లౌకిక జీవన దుఃఖాలనుండి పరిష్కార మార్గానికి ప్రేరేపిస్తాయి కూడా! ఆత్మోజ్జీవనాన్ని కలిగించే కార్య సాధనకు కర్తవ్యోన్ముఖులను గావిస్తాయి.

సామాన్యులు సముపార్జించిన జ్ఞానము, విద్య, మానసిక బలము ఉదర పోషణకు వారి వ్యక్తిగత కుటుంబ సంపదను పెంపొందించుకోవడానికి పేరు ప్రతిష్ఠలకు ఉపయోగ పడతాయి. కానీ సత్పురుషులైన వారి సర్వసంపదలు లోకక్షేమానికే ఉపయోగపడతాయి. ఇటువంటి ఒక గొప్ప విశేషం మన భారతదేశ సంస్కృతి లోనే కనిపిస్తుంది. సమాజాన్ని లౌకికంగా, భౌద్ధికంగా, ఆధ్యాత్మికంగా ఉన్నతంగా తీర్చిదిద్దే త్యాగనిరతి గల మహనీయులు మన చరిత్రలోనే కనిపిస్తారు. అటువంటి పరమ ఋషి సంస్కృతికి నిలయమైనది భరత వర్ష వైభవం.

వివిధ వైరుధ్య ప్రభావాలతో జాతి గతి అదుపు తప్పే ప్రతి గమనంలోనూ సద్గతిని కలిగించటానికి మహాత్ములు అవతరిస్తూనే ఉంటారు. "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి" అని భగవంతుని వాక్కుగా పెద్దలు సంస్మరిస్తూ గుర్తు చేస్తారు. అలా వేద ధర్మాన్ని లోక క్షేమకరంగా అనుసరించే విధాన్ని మన కందించిన వారు జగదాచార్యులు భగవద్రామానుజా చార్యులు. వారు భౌతిక ప్రవర్తనలనే కాదు మానసిక విలువలను పునరుద్ధరించి ప్రవర్తింపజేశారు.

పరిపూర్ణమైన లోకహితానికి శృతి స్మృతి శాస్త్ర పురాణేతిహాస సూచకంగా ఏర్పాటు చేయబడిన నిత్య నూతనమైన మన సనాతన ధర్మమే మూలము. అదే మానవుల ఇహ పర (ఈలోక, పరలోక) ప్రయోజనాలను కలిగిస్తుంది. అటువంటి వేద ధర్మాన్ని స్థాపించి ప్రవర్తింప చేసినవారు. గొప్ప జ్ఞాన పరిపక్వత కలిగి అందరిని ఉద్ధరించాలని ప్రీతి కలిగినవారు భగవద్రామానుజాచార్యులు. సర్వ జగత్కారణుడు, రక్షకుడు అగు భగవంతుని తత్వాన్ని సత్యాన్ని ప్రకాశింపచేయుటకే అవతరించిన వారు భగవద్రామానుజా చార్యులు. లోకోద్ధరణకు కృషి చేసే ఆచార్యులను భగవంతుని పాదాలుగా భావిస్తారు. అందుకే అన్ని సాంప్రదాయాల్లోనూ గురువులను భగవత్పాదులు అని వ్యవహరిస్తారు. అలాగే భగవంతునిలోని ఏదో ఒక అంశ ఆచార్యునిగా అవతరించి లోకాన్ని ఉద్ధరిస్తుందని పెద్దలు చెబుతారు. ఆ విధంగా సర్వులను తరింప చేసిన ఉత్తారకులుగా భగవత్ రామానుజులను గురించి వారి పూర్వ ఆచార్యులు, సమకాలికులు, తర్వాతి తరాల వారు కూడా నిరూపించి తెలిపారు. ఆ చరిత్ర విశేషాలను రామానుజాచార్యుల మూడు తరాల తర్వాతి వారైన పిన్నబజగియ పెరుమాళ్ జీయర్ రచించిన "గురుపరంపంరాప్రభావం" గ్రంథం ద్వారా పెద్దలు వివరిస్తారు. 6000 పడి తో ద్రావిడంలో రచింపబడిన ఈ గ్రంథం పూర్వాచార్య చరిత్రకు మూలాధారం. పూర్వాచార్యులైన నంబిళ్ళై శిష్యులైన పెరుమాళ్జీయర్ భగవద్రామానుజాచార్యుల చరిత్ర సన్నివేశాలను గ్రంథస్థం చేశారు.

పరిపూర్ణుడైన గురువు సాక్షాత్ భగవంతుని అవతారమే! "గురురేవ పరం బ్రహ్మ" అని, "లోకానాం హితకామ్యయా మానుషం వపురాస్థాయ" అని "విష్ణుర్మనుష్య రూపేణ చచార వసుధాతలే" అని ఎన్నో ప్రమాణాలను ఉదహరిస్తూ ఆచార్యులకు (ప్రధానంగా భగవద్రామానుజాచార్యులకు) భగవంతునికి గల సంబంధాన్ని పోలికలను సమర్థిస్తారు.

# శ్రీరామానుజ సుధామాధురి



భగవంతుడు నిర్హేతుక కృపా కటాక్షంతో రక్షించినట్లుగా భగవద్రామానుజాచార్యులు కూడా అవ్యాజ కరుణతో ఎందరినో దిద్దుబాటు చేసి కీర్తి వంతులను గావించారు. కరడుగట్టిన కాఠిన్యాన్ని కరిగించగల సమర్థులు, సన్మార్గం వైపు మరల్చగల సౌశీల్యులు జగదాచార్యులు. ఆచార్యులు సంకల్పిస్తే కరుణిస్తే పతితులను పావనం చేయగలరు. ఎంతటి వారినైనా రూపురేఖలు మార్చి కాంతిరేఖలు దిద్దగలరు అటువంటి కరుణామూర్తులు భగవత్ రామానుజాచార్యులు.

పెరియ కోయిల్ నంబిగా వ్యవహరించే తిరువరంగత్తముదనార్లు రంగనాథ దేవాలయ అధికారిగా, ప్రతినిధిగా ఉండేవారు. ఆరాధనలో వేద పురాణాలను రంగనాథుని ముందు విన్నవించేవారు. పాండిత్యం భావుకత్వం, సున్నితత్వం గలవారు. కానీ వారి కర్తవ్య పాలనలో రంగనాథుని ఆరాధనలో లోపాలను రామానుజాచార్యులు సహించలేకపోయారు. తగినట్లుగా సౌమ్యులు సాత్వికులైన కూరత్తాళ్వార్‌ను అముదనార్లను పరివర్తన చేయించుటకు పురమాయించారు. ఫలితంగా ఆముదనార్లు శ్రీ వైష్ణవ ప్రపన్న శిఖామణిగా మారి ఆచార్య భక్తితో ప్రపన్న గాయత్రిగా ప్రసిద్ధమైన గొప్ప ప్రబంధాన్ని రచించి అందరికీ మార్గదర్శకులయ్యారు.

ఆచార్యుడు శిష్యుని సంస్కారవంతుని గావించే విశేషాన్ని పెద్దలు "భ్రమర కీటక న్యాయం" అని చెప్తారు. అంటే ఒక భ్రమరం కీటకాన్ని గూటిలో పెట్టి దాని చుట్టూ గీతాలాపనతో తిరుగుతూ ఆ కీటకం గొంతును రంగును తన వలె తీర్చిదిద్దుతుందట! అప్పుడు అది కూడా భ్రమరం అవుతుంది అన్నమాట!

శ్రీరంగం సమీపంలో నిచుళా అనే నగరంలో మల్లయోధుడు ధనుర్దాసు అనే మహా బలవంతుడు ఉండేవాడు. అతన్ని చూస్తే అందరూ భయపడేవారు చంద్రవదన అయినా పున్నాంబ (హేమాంబ) అనే ప్రియురాలు (భార్య) అతనితో ఉండేది. అతను ఎక్కడికి వెళ్లినా ఆమె పైన ఆకర్షణతో ఆ ముఖాన్ని చూస్తూ ఉండేవాడు. శ్రీరంగంలో చైత్రోత్సవాలు జరుగుతున్నప్పుడు హేమాంబ ధనుర్దాసులు అక్కడికి వచ్చారు. అయితే వీధిలో నడిచే హేమాంబ ముఖంపై చెద్దరును (వస్త్రాన్ని) గొడుగులా పెట్టి ఆమెను చూస్తూ అతడు వీధుల్లో తొట్రు పడుతూ వెనుకకు నడుస్తూ వెళుతున్నాడు. ఆ దృశ్యం చూసి అందరూ నవ్వుకుంటున్నారు. కావేరి నదీ స్నానం చేసి శిష్యులతో కలిసి ఆ దారిలో వస్తున్న భగవద్ రామానుజాచార్యులు అది చూశారు. మోహమనే మాయలో అజ్ఞాని అయిన ఇతన్ని వెంటనే "నిర్లజ్జం కామినీ భూత మోహితం మూఢచేతసం రంగేశాభిముఖం శీఘ్రం కరిష్యామ్యధు నైవతత్" అని మోహ పరవశుడైన, సౌందర్యారాధకుడైన ధనుర్దాసును వెంటనే శ్రీ రంగనాథులకు అభిముఖం గావిస్తానని శిష్యులతో చెప్పాడు. నివాసానికి పిలిపించి తన వద్దకు వచ్చిన ధనుర్దాసును చిరునవ్వుతో పలకరించి, అతని వివరాలు తెలుసుకున్నారు. "ఎందరో రహస్యంగా స్త్రీలకు దాస్యం చేస్తారు నీవెందుకు బహిర్గతంగా ఇలా చేశావని" ప్రశ్నించారు. దానికి ధనుర్దాసు "నేను అలాంటి వాడిని కాను కానీ ఆమె పద్మ నేత్రములందు నా మనసు మగ్నం అయి ఉంది.

(మిగతా 9 వ పేజీలో)

# వృషభంలో వైశాఖ మాస విశిష్టత

ప్రత్యేకం

శ్రీరామాయ నమః

శ్రీమతే రామానుజాయ నమః

వైశాఖ మాసము అనేక ప్రత్యేకతలు కల మాసము. ఈ మాసంలో మంచి మంచి విశేషమైన పర్వదినాలు ఉన్నాయి. విశాఖా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసము కావున ఈమాసమునకు వైశాఖ మాస' మనే పేరు ఏర్పడింది.

ముఖ్యంగా వైశాఖ శుద్ధ తృతీయ 'అక్షయ తృతీయ'గా లోకంలో ప్రసిద్ధి పొందింది. ఇది కృత యుగారంభమని ధర్మశాస్త్ర గ్రంథాలు తెలుపుతున్నాయి. అనగా ఇది ఉగాది పండుగతో సమానమైన రోజు. ఈ నాడు గంగా స్నానము, యవలచే (ధాన్యవిశేషము) హెూమము, యవాశనము అనగా యవధాన్యమును ఆహారముగా స్వీకరించుట వల్ల సర్వపాపములు నశిస్తాయని ధర్మశాస్త్ర వచనము. అంతే కాక,

యః కరోతి తృతీయాయాం
కృష్ణం చందన భూషితం।
వైశాఖస్య సితే పక్షే
సయాత్యచ్యుత మందిరం॥

ఎవరైతే ఈ వైశాఖ శుక్ల తృతీయ నాడు అనగా అక్షయ తృతీయ నాడు శ్రీకృష్ణునికి చందన అలంకారమును చేస్తారో వారు విష్ణు సాలోక్యమును పొందుతారని ధర్మశాస్త్రము చెపుతున్నది. ఈనాడు కొంచెమైననూ జప, హెూమ, పితృ తర్పణాదులు చేసినచో అవి అక్షయ్య మవుతాయి. రోహిణీ నక్షత్రము, బుధ వారముతో కలిసిన అక్షయ తృతీయ మహా పుణ్యము.



ఈ అక్షయ తృతీయ యందు సింహాచల పుణ్యక్షేత్రమందు శ్రీవరాహ నరసింహ స్వామి వారికి చందనోత్సవము చేసే సంప్రదాయం ఉన్నది. సంవత్సర మంతా చందన అలంకారంలోనే ఉండి దర్శన మిచ్చే వరాహ నరసింహస్వామి ఈ ఒక్కరోజు మాత్రం నిజ రూపంలో దర్శనమిచ్చి భక్తులను అనుగ్రహిస్తారు.

అలాగే ఈరోజు పరశురాముడు అవతరించిన రోజుగా పురాణ



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

> 'అక్షయ తృతీయ' ఉగాది పండుగతో సమానమైన రోజు. ఈ నాడు గంగా స్నానము, యవలచే హెూమము, యవాశనము అనగా యవధాన్యమును ఆహారముగా స్వీకరించుట వల్ల సర్వపాపములు నశిస్తాయని ధర్మశాస్త్ర వచనము.

ములు పేర్కొంటున్నాయి. కనుక ఈనాడు పరశురామారాధన కూడా చేసి, "జామదగ్న్య మహావీర
క్షత్రియాంతకర ప్రభో–
గృహాణార్ఘ్యం మయాదత్తం
కృపయా పరమేశ్వర॥" అనే మంత్రంతో ఆర్ఘ్యమును సమర్పించాలని ధర్మశాస్త్రం చెపు తున్నది.

వైశాఖ శుద్ధ ఏకాదశి నాడు సత్యనారాయణ స్వామి వారి కల్యాణం నిర్వహించు కోవటం సంప్రదాయం. అన్నవర క్షేత్రంలో వెలసిన రమా సహిత సత్య నారాయణ స్వామి కల్యాణోత్సవమ్ అత్యంత వైభవంగా ఈ నాడు నిర్వహింపబడుతుంది.


ఇక వైశాఖ శుద్ధ చతుర్దశి "శ్రీ నృసింహ జయంతి" శ్రీ నృసింహుని అష్టోత్తర శత నామావళితో 'వైశాఖ శుక్ల భూతోత్థాయ నమః' అని పూజిస్తారు.

"వైశాఖే మాసి శుక్లాయాం చతుర్దశ్యామ్ శుభే దినే।
సంధ్యాకాలేన సంయుక్తే స్తంభోద్భూతో నృకేసరీ॥" అని

నృసింహ జయంతి నాడు స్వామిని పూజించి హారతి సమర్పిస్తారు.

# వైశాఖ మాస విశిష్టత

నృసింహారాధన సాయం సంధ్యా కాలంలో చేయడం సంప్రదాయం. ఈ సంవత్సరం సౌరమానం ప్రకారం వృషభము, స్వాతి నక్షత్రము కూడా కలిసి రావడం విశేషం.



ఇదే రోజున ఈ ఏడాది నమ్మాళ్వారుల తిరునక్షత్రమ్ పదకవితా పితా మహుడు అన్నమాచార్యుల వారి జయంతి రావడం కూడా విశేషమే.

రామానుజీయ శ్రీవైష్ణవ ఆచార్య పరంపరకు ఆద్యులు శ్రీనమ్మాళ్వారులు. శ్రీవైష్ణవ ఆలయములలో విష్ణుపాదుక లకు 'శఠారి' అని పేరు.

నమ్మాళ్వారులకే "శఠకోపులు, శఠారి" అనే పేర్లు కలవు. శ్రీవిష్ణు పాదుకలను 'శఠారి' అని పిలిచే సంప్రదాయం వీరు అవతరించిన తర్వాతే ఏర్పడింది. వృషభ మాసం విశాఖ నక్షత్రంలో అవతరించిన వీరి తిరునక్షత్రం ఈనెల (మే) 23వ తేది అన్ని వైష్ణవాలయాలలోను విశేషంగా జరుగుతుంది.



ఇక వైశాఖ బహుళ దశమి హనుమాన్ జయంతి. ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలలో కల హనుమాన్ దేవాలయాలలో ఈ నాడు విశేషమైన పూజలు ఆంజనేయ స్వామి వారికి జరుపుతారు. సుందరకాండ పారాయణలు, హనుమాన్ చాలీసా పఠనములతో హనుమంతుని ఆలయాలు మారుమ్రోగుతాయి. ఇన్ని విశేషాలు కల ఈ వైశాఖ మాసాన్ని సద్వినియోగం చేసుకొని భగవదనుగ్రహ పాత్రులమవుదాం!

★

# శ్రీరామానుజ సుధామాధురి

(7 వ పేజీ తరువాయి))

ఎండలో ఆమె ముఖము నేత్రములు వాడిపోతే నేను తల్లడిల్లి పోతాను. నాకు మంచి మార్గం చెప్పండి" అని అన్నాడు. అందుకు రామానుజాచార్యులు "ఇంతకంటే గొప్ప సౌందర్యం గల నేత్రాలు నేను చూపిస్తాను" అని పలికారు. ధనుర్దాసు "ఇంతకన్నా అందమైన నేత్రాలు ఉండనే ఉండవు అని చెప్పి ఉంటే కనుక నేను ప్రయోజనం పొందిన వాడి నవుతాను చూపించండి" అని అన్నాడు. వెంటనే యతిరాజులు రంగనాథుని సన్నిధికి తీసుకొని వెళ్ళాడు. తన హస్తంతో అతని చేతిని పట్టుకొని రఘువంశకుల భాగ్యము, సౌందర్యరాశి "ఆజానుబాహుం అరవింద దళాయతాక్షం" అయిన శ్రీరంగనాథుని చూపించాడు. దయాసింధువైన యతిరాజుల వాక్కుతో, ఆశీస్సులతో, పవిత్ర స్పర్శతో పునీతుడై ఆ దివ్య నేత్రాలను దర్శనం చేసుకున్న ధనుర్దాసు "ప్రహృష్ట చిత్త స్తతయోర్నిమగ్నః" అన్నట్లు ఆ సౌందర్యంలో, భక్తిలో నిమగ్నుడైపోయాడు. జగదాచార్యులు ధనుర్దాసుకు తీర్థప్రసాదాలు ఇచ్చి పంచ సంస్కారాలు చేశారు. అదే మార్గంలో అతని భార్య హేమాంబ కూడా జ్ఞాన వైరాగ్యాలను పొంది ఆచార్య భక్తితో వారి సన్నిధిలోనే సేవలో గడిపారని చరిత్ర.

మరొక సన్నివేశంలో కూడా ధనుర్దాసు హేమాంబల ఆచార్య నిష్ఠను వారి పవిత్ర మనస్తత్వాన్ని జగదాచార్యులు నిరూపించి చూపించారు. నిత్య కావేరీ జల స్నానానికి శిష్యులతో కలిసి వెళ్ళి, యతిరాజులు తిరిగి వచ్చేప్పుడు ధనుర్దాసు చేయి పట్టుకొని వచ్చేవారట! స్నానానంతరం బ్రాహ్మణేతరుని స్పృషించడాన్ని చూసి చిన్నబోయిన శిష్యులకు ఆ దంపతుల పవిత్రతను మరో సన్నివేశం ద్వారా చాటిచెప్పి నిరూపించారు. "విద్యా మదో ధనమదస్తృతీయో భిజనమదః ఏతే మదావలిత్తానం ఏత యేవ సతాం దమాః" విద్య ధన అభిజన అనే మూడు మదాలు మానవులను అపవిత్రం చేస్తాయి అని అవి లేని వారు ధనుర్దాసు హేమాంబ అని వారి పవిత్రతను వెలువరించారు. పరిపూర్ణమైన వైష్ణవత్వ సాధనకు మదరాహిత్యమే ప్రధాన లక్షణం అని తెలియజేసిన కరుణామూర్తులు భగవత్ రామానుజాచార్యులు

★

# సంకీర్తనల పెన్నిధి – అన్నమాచార్య పదగీతి

**– శ్రీమతి సముద్రాల శారద**



భక్తిని, వేదాంత సార నిధిని లోకానికి అందించిన సంకీర్తనాచార్యులు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు. "అన్ని మంత్రములు నిందే ఆవహించెను" అని కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వర మంత్ర వైభవాన్ని తెలియచెప్పారు.

పద కవితా పితామహులుగా ప్రసిద్ధి చెందారు. వీరు 1408- 1503 మధ్యకాలం వారని పెద్దలు నిర్ధారించారు. కారణజన్ములైన వీరి జీవితం ఎన్నో ఆటుపోటులకు గురి అయినా ఆనంద స్వరూపుడైన పరబ్రహ్మ తత్వాన్ని వారు దర్శించారు. మధుర గాన లహరితో సకల మానవులకు దర్శింప చేశారు. సులభమైన వాడుక శైలిలో వారి రచనలు సాగినా భక్తి తత్వముతో పాటు వారి సంకీర్తనలలో పాండితీ ప్రతిభ ప్రతిఫలిస్తూనే ఉంటుంది. భావలాలిత్యం కలిగిన వీరి కీర్తనాసరళి తెలుగు నాట ఒక సంస్కృతిగా మారింది. పండుగలకు సంబంధించిన, శుభకార్యాలకు సంబంధించిన అనేక సంస్కృతి విశేషాలు వీరి కీర్తనల్లో కనిపిస్తాయి. వైష్ణవాగ్రేసరులుగా పంచ సంస్కారాలు పొంది సాంప్రదాయాన్ని అనుసరించారని చరిత్ర చెబుతున్నది.

తిరుమల తిరుకోవెలలో వారి సంకీర్తన తాళపత్ర నిధిని "అన్నమాచార్య భాండాగారంగా" ప్రతిష్ఠించారు. నేటికీ వారి వంశస్థులు తిరుమల వెంకటేశ్వర స్వామి సేవలో అన్వయిస్తారు. అన్నమాచార్యులే ఆదర్శంగా తాళ్లపాక వంశంలో తర్వాత తరాల వారు అనేకమంది కవులుగా ప్రసిద్ధి పొందారు. 32 వేల సంకీర్తనలతో తిరుమల శ్రీనివాసుని పరబ్రహ్మస్వరూపంగా కొలిచి కీర్తించిన పరమ భక్తులు అన్నమాచార్యులు. వంశపారంపర్యంగా గొప్ప దైవభక్తి గల బ్రాహ్మణవంశంలో భగవంతుని పంచాయుధాల్లో నందకం అంశతో జన్మించినట్లు పెద్దలు చెప్తారు.

సంగీత సాహిత్య సౌరభాలతో నవరసాలు మేళవించిన అన్నమయ్య కీర్తనలు ఆత్మోజ్జీవనానికి ఉపకరించే ఉపదేశాలు. అందుకే వారిని ఆచార్యులుగా కొలుస్తారు. వారి కీర్తనల నిధి మన జాతికి అందిన ఒక గొప్ప ఆధ్యాత్మిక సంపద. అది తెలుగుజాతి గర్వించదగిన అమూల్యమైన పెన్నిధి.



## ఆధ్యాత్మిక రంగంలో సేవలు అందించే సంస్థలకు స్వాగతం

వేద ధర్మ పరిరక్షణలో కృషి చేస్తూ, ఆధ్యాత్మిక రంగంలో సేవలు అందించే సంస్థలు. వాటి కార్యక్రమాలు, లక్ష్యాల గురించి శ్రీసన్నిధానం పత్రిక ద్వారా సమాజానికి తెలియజేద్దాం!

**సంప్రదించండి: 95025 83323**

# శ్రీపతి స్తుతి - సుభాషితం

మంచి మాట



**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

## అర్చిరాది సంగ్రహం

(గత సంచిక తరువాయి)

తాత్పర్యం:

మానవుడు 'పునర్జన్మదుఃఖం వద్దు' అనుకొని భగవంతుని యందు అపార భక్తి యుతులైన సత్పురుషులతో సహవాసం చెయ్యాలి. దానితో విరక్తి ఏర్పడుతుంది. అప్పుడు శాశ్వతమైన శ్రీవైకుంఠంలో పరమాత్మతో సుఖాన్ని పొందవలెనని జ్ఞానం కలిగి శ్రియఃపతితో మనకు సంబంధమును కలిగించ సమర్థుడైన ఆచార్యుని ఆశ్రయించి పంచసంస్కారవంతుడై అసలు తానెవరో, తన ఉనికి, తన లక్షణము తెలుసుకున్నవాడౌతాడు. అంటే ఈ జీవుడు పరమాత్మకు దాసుడు. అదే తన స్వరూపము 'అది లేనిదే తాను లేడు' అనే తెలవిగలవాడౌతాడు. అప్పుడు ఈ జీవునికి సంచితం, ఆగామి, ఆరబ్దం అని మూడు కర్మలుంటవి. అవి తొలగి పోవాలి. అప్పుడే మోక్షం కలుగుతుంది. ఎట్లపోతవి? ఎవరు పోగొడుతారు?

ఎప్పుడైతే ఆచార్యుని ద్వారా పరమాత్మకు శరణాగతి చేసి తనను స్వామికి అర్పణ చేసుకొని 'తనరక్షణ అంతా ఆయన బాధ్యత' అనుకుంటాడో అప్పుడే స్వామి మన కర్మలను తొలగించి తన వద్దకు చేర్చుకునే బాధ్యత వహించును. ఈ జీవునికి మూడు రకాల కర్మలుంటవి అనుకున్నాంగదా! 'సంచితం' అంటే 'అనేక జన్మల నుంచి చేసిన పుణ్య, పాప రూపుమైన కర్మ' పుణ్య ఫలమంతా ఈతనిని ఎవరు ప్రేమించుతారో వారికి ఇచ్చేస్తాడు. మరి పాపఫలమో! దానిని వీడిని ద్వేషించే వారికిస్తాడు. అంటే మిత్రులకు పుణ్యం, శతృవులకు పాపం అన్నమాట.

పోతే 'ఆగామి' కర్మ అంటే శరణాగతి చేసిన తర్వాత గూడా కొంత కాలం ఈ శరీరంలోనే వుంటాడు గదా! అప్పుడు తెలియక కొన్ని పుణ్య పాప కర్మలు, తెలిసి గూడా ప్రకృతి వశుడై చేసేటివి పుణ్య, పాపములు. అవి అంటకుండా చేస్తాడు. ఆ రకంగా 'సంచిత, ఆగామి' కర్మలను లేకుండా చేస్తాడు. ఆ విషయాన్నే 'ప్రక్షీణ కర్మాంతరః' అనే పదం తెలుపుచున్నది.

ఇంక 'ఆరబ్ధ కర్మ' అదే ప్రారబ్ధ కర్మ. అదెట్ల పోగొట్టును? అంటే దానిని తగ్గించి తగ్గించి ఈ శరీరావసానంలోనే అనభవింప చేస్తాడు. తగ్గించి అంటే ఈ ప్రారబ్ధ కర్మ గూడా అనుభవించుటకు ఈ ఆయుష్యం చాలనంత. ఇతర జన్మలలో గూడా అనుభవించతగినంత వుందనుకోండి 'సౌబరి' వలె, 'జడ భరతు'ని వలె. అదిగో అట్టి ప్రారబ్ధమును తగ్గించు తాడన్నమాట. ఎందుకంటే 'తిరుక్కచ్చినంబి' ద్వారా రామానుజులకు తెలిపిన ఆరు వార్తలలో 'కంచి వరదుడు' 'దేహావసానే మోక్షం స్యాత్' అని తెలిపినాడు కాబట్టి. (ఈ దేహం చాలించిన తర్వాతనే మోక్షం కలుగుతుంది) దానినే 'కర్మశకలం ప్రారబ్ధం పరిభుజ్య' అనే పదం తెలుపుచున్నది.

శరణాగతి చేసినంతనే పరమ దయాళువు, సర్వతంత్ర స్వతంత్రుడు అందరిని శాసించేవాడైన పరమాత్మ జీవునకుండే ప్రకృతి బంధాన్ని తొలగింప జేయటానికి జీవుని వెంటనే వుంటాడు. మన శరీరంలో 79 వేల నాడులుంటవి. అందులో 101 నాడులు ప్రాణం పోయే మార్గాలు. అందులో మళ్ళీ 101వ నాడి. దానికి 'సుషుమ్న' అని 'ధమని' అని పేర్లు. శరణాగతి చేసిన జీవుడు ఆ సుషుమ్న నాడి ద్వారానే బయటకు వస్తాడు. ఆ నాడి హృదయం నుండి శిరస్సు మధ్య 'బ్రహ్మరంధ్రం' వరకు వ్యాపించి వుంటుంది. ఆ నాడి జీవునికి అసలే తెలియదు గదా! అనుకోకండి. వీడికి తెలియాల్సిన పనిలేదు. పరమాత్మనే వీడికి తేజోమార్గాన్ని చూపించుతాడు. కపాలభేదనం చేసి వెలుపలికి వస్తాడు. అంటే శిరస్సు పగులుతుందా? అనుకోకండి. సూక్ష్మరంధ్రాలు మన శరీరంలో అనేకం వుంటవి. వాటి ద్వారా అన్నమాట.


ఇది మొదటి శ్లోకానికి తాత్పర్యము. ఇందులో క్రియాపదం లేదు. దీనికి రెండవ శ్లోకానికి సంబంధం వుంటుంది.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)


# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

## భూపరీక్షా క్రమము

పణవాకారము




గృహము నిర్మించు స్థలము పణవాకారముగ వున్న “పణవే లోచనక్షతిః” అంధత్వమును నేత్ర రోగములను కలుగచేయును.




మురజాకారము

గృహ నిర్మాణము చేయు స్థలము మురజాకారము (మద్దెల) నున్న “మురజే మ్రియతే భార్యా” భార్యను నశింప చేయును.

బృహన్ముఖాకారము.




గృహనిర్మాణము కావించు స్థలము బృహన్ముఖాకారముగ యున్న “బంధునాశో బృహన్ముఖే” బంధు నాశమును కలుగ చేయును.



వ్యజనాకారము


గృహనిర్మాణము జరుపుస్థలము వ్యజనాకారము (విసనకర్ర) వున్న “వ్యజనే విత్త నాశః స్యాత్” ధననాశనమును కలిగించును.

కూర్మ పృష్ఠాకారము



గృహనిర్మాణము చేయు స్థలము కూర్మ పృష్ఠాకారముగా యున్న “కూర్మే బంధనం పీడనం” బంధనము పీడనమును కలిగించును.

ధనురాకారము




గృహనిర్మాణము చేయు స్థలము ధనురాకారముగ యున్న “వృత్త క్షేత్రార్థమేవ చాపమితి కథ్యతే” “చాపే చోరభయం భవేత్” చోరుల వల్ల భయము కల్గును.



**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**

శూర్పాకారము



గృహనిర్మాణము చేయు స్థలము శూర్పాకారముగ యున్న “శూర్పే ధనక్షయం విద్యాత్” ధన నాశమును కలిగించును.

ప్రశస్తాకృతులు

శ్లో॥ చతురశ్రా మహాధన్యాద్విపాభా ధనదాయినీ।
సింహాభా సుగుణాన్ పుత్రాన్ వృషాభా పశువృద్ధిదా॥
వృత్తా సద్విత్తదా భూమిర్భద్ర పీఠ నిభా తథా।
త్రిశూల రూపా వీరాణా ముత్పత్తిర్ధన సౌఖ్యదా॥
లింగాభా లింగినాం శ్రేష్ఠా ప్రసాద ధ్వజ సన్నిభా।
పదోన్నతిం ప్రకురుతే కుంభాభా ధనవర్ధినీ॥

నాల్గు కోణములు సమముగా వున్న స్థలము మిక్కిలి శ్రేష్ఠము. ఏనుగు ఆకారముగా యున్న స్థలము ధనము నిచ్చును. సింహ ఆకారముగా యున్న స్థలము సుగుణవంతులయిన పుత్రుల నుదయింపచేయును.

వృషభాకారముగా యున్న (మిగతా 15 వ పేజీలో)

# భూలోకవైకుంఠం రామనారాయణ భద్రాచలక్షేత్రం

# వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణం



ఆగమ శాస్త్ర రీత్యా, భద్రాచల దివ్య క్షేత్ర సాంప్రదాయ రీత్యా ఊరూరా, దేశ విదేశాల్లో శ్రీరామనవమి సీతారామ కళ్యాణ ఉత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. క్రోధి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి శ్రీరామనవమి ఏప్రిల్ 17 న భద్రాచల దివ్య క్షేత్రంలో సీతారామకళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖులు, ప్రభుత్వ అధినేతలు, అర్చకోత్తములు, భక్తజనుల సందోహంతో శ్రీ సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు.

## భూ వైకుంఠము భద్రాద్రి. సీతారాములే లక్ష్మీనారాయణులు

శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,
స్థానాచార్యులు, భద్రాచలం



భూ వైకుంఠము భద్రాచల దివ్యక్షేత్రం. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే పరమపదం నుండి భూలోకానికి దిగినటువంటి ప్రాంతం. ఈ ప్రాంతంలో రామచంద్రుడు స్వయంభువుగా ఆవిర్భవించాడు రామావతార కాలంలో కూడా రాముడు తన వనవాస కాలంలో సంచరించినటువంటి ప్రాంతం. రామావతారం ముగిసిన తర్వాత కూడా భద్ర మహర్షి తపఃఫలంగా వైకుంఠం నుంచి శ్రీమన్నారాయణుడు శంఖ చక్ర ధనుర్బాణ ధారియై చతుర్భుజ రాముడుగా ఆవిర్భవించిన ప్రాంతం భద్రాచలం దివ్య క్షేత్రం. కనుక ఇక్కడ ఉండే రాముణ్ణి, సీతమ్మవారిని లక్ష్మీనారాయణులుగా సంభావించి ఆరాధనలు జరపడం ఆచారం. భద్రాచలంలోని సీతారాములను సాక్షాత్తు లక్ష్మీ నారాయణులనే సంభావిస్తారు. అందుకనే రామదాసుగారు ఒక పద్యంలో చెప్పారు. రామచంద్రుడు భూలోకాన్నే కాకుండా సకల లోకాలను పరిపాలించేవాడు. ఆయన అంటారు

**ఉ. నీ సహజంబు సాత్వికము నీ విడిపట్టు సుధాపయోధి, ప
ద్మాసనుఁడాత్మజుండు, గమలాలయ నీ ప్రియురాలు, నీదు సిం
హాసనమిద్ధరిత్రి, గొడుగాకస మక్షులు చంద్ర భాస్కరుల్,
నీసుమతల్పమాది ఫణి, నీవె సమస్తము గొల్చినట్టి నీ
దాసుల భాగ్యమెట్టిదయ దాశరథీ! కరుణాపయోనిధీ॥**

అని అంటారు. ఈ పద్యంలో విష్ణుమూర్తి కుండే లక్షణములు అన్ని చెప్తున్నారు రామదాసుగారు. "నీ సహజంబు సాత్వికము" సత్వగుణ ప్రధానమైన దైవము మహా విష్ణువు. బ్రహ్మదేవుడు రజోగుణం కలిగిన వాడు. పరమశివుడు తమోగుణ ప్రభావం కలిగిన వాడు మహావిష్ణువు సాత్విక గుణమే మూర్తీభవించినవాడని పురాణాలు చెబుతున్నాయి. "నీ విడి పట్టుసుధాపయోధి" పాలసముద్రం నీవు నివసించే ప్రాంతం. "పద్మాసనుడు ఆత్మజుడు" పద్మనాభుడైన నీకు పద్మము ఆసనముగా గలిగినవాడు బ్రహ్మదేవుడు కుమారుడు. "కమలాలయ నీ ప్రియురాలు" అనగా లక్ష్మీదేవి నీ ప్రియురాలు. "నీదు సింహాసన మిద్ధరిత్రి" సమస్త భూమండలం అంతా నీ సింహాసనం. "గొడుగాకసం" ఆకాశం గొడుగు. అక్షులు చంద్ర భాస్కరులు. నీ నేత్రములు చంద్రసూర్యులు పడుకొనే పూల పడక ఆదిశేషులు. నీ మహత్యము నీ దాసులకు భాగ్యము. నీ మహత్యము నీ దాసులకు ఎంతో గొప్ప భాగ్యం. కరుణాపయోనిధి యగు రామచంద్రా! నీవు సాక్షాత్తు శ్రీ మహావిష్ణువే ! అని చెప్తూ సమస్త భూమండలం నీ ఏలికలోనే ఉన్నది అని అంటారు. కనుక మహావిష్ణు స్వరూపమైన స్వామి భద్రాచల దివ్య క్షేత్రంలో వేంచేసి ఉన్నారు. అందుకే భద్రాచలాన్ని మోక్షపట్టణంగా చెప్తారు. వైకుంఠ రాముడు, రామనారాయణుడు, ఓంకారరాముడు అని అనేక నామాలతో కీర్తిస్తారు.

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(క్రిందటి సంచిక తరువాయి)

బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన అత్రిమహర్షిని, బ్రహ్మదేవుడు సృష్టి చేయమని ఆజ్ఞాపించాడు. అప్పుడు ఆయన తన ధర్మపత్ని ఐన అనసూయాదేవితో కలసి ఋక్షపర్వతానికి వెళ్లి తపస్సు చేశాడు.

ఆ కొండలోని అడవులలో మోదుగు, కంకేళి చెట్లు పూలగుత్తులతో నిండి ఉన్నాయి. నిర్వింధ్యా నదీజలాలు ప్రవహిస్తూ చేసే ధ్వనులు ఆ పర్వత ప్రాంతమంతా వ్యాపించాయి. అత్రిమహర్షి అక్కడి శీతోష్ణాలు, సుఖదుఃఖాలు మొదలైన ద్వంద్వాలకు అతీతుడై, వాయుభక్షణ చేస్తూ, ప్రాణాయామంతో మనసును వశం చేసుకొని, వంద సంవత్సరాలు ఒంటికాలి మీద నిలబడి తపస్సు చేశాడు. “జగన్నాథుడైన పరమేశ్వరునికి నేను శరణాగతి చేస్తున్నాను. ఆయన నాకు తనతో సమానమైన సంతానాన్ని అనుగ్రహించాలి!” అని ధ్యానిస్తూ తపస్సు చేశాడు.

ప్రాణాయామమే ఇంధనం కాగా, అత్రిమహర్షి శిరస్సు నుండి అగ్ని వెలువడసాగింది. దానితో మూడు లోకాలూ తపించాయి. అప్పుడు సర్వ సమర్థులైన త్రిమూర్తులు ఆ పరిస్థితిని చూసి, ఆ మహర్షి ఆశ్రమానికి వెళ్లారు. వారు వెళ్లటం చూసి అప్సరలు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు, నాగులు వారి కీర్తిని విస్తారంగా గానం చేశారు.

ఒకటేసారి త్రిమూర్తులు ప్రత్యక్షం కావడంతో అత్రిమహర్షి ఉల్లాసాన్ని పొందాడు. జ్ఞానప్రకాశంతో ఆయన మనస్సు పనిచేయసాగింది. ఒంటికాలిపై నిటారుగా నిలబడి ఉన్న ఆయన, తన ఎట్టయెదుట దేవశ్రేష్ఠులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులను దర్శించాడు.

వారు ముగ్గురూ హంస గరుడ వృషభ వాహనాలపై తమ తమ చిహ్నాలతో వెలిగిపోతున్నారు. వారి నేత్రాలు దయతో నిండిఉన్నాయి. చిరునవ్వు నిండిన ముఖాలతో ఉన్నారు. దానిని బట్టి వారు తన తపస్సుకు ప్రసన్నులయ్యారని గ్రహించిన మహర్షి, దండము వలె భూమిపై పడి వారికి నమస్కరించాడు. వారిని పుష్పాలతో పూజించాడు.

ఆ ముగ్గురి కాంతి మహర్షి కన్నులకు మిరుమిట్లు కొలిపింది. తన నయనాలు మూసుకొని, దోసిలి ఒగ్గి మనసును వారిపై నిలిపాడు. మధురమూ, భావపూర్ణమూ ఐన వేదసూక్తాలతో ముల్లోకాలలోనూ ఉత్తములైన ఆ ముగ్గురినీ స్తుతించాడు.



**శ్రీమతి తిరుమల నీరజ**

“ప్రతికల్పంలోనూ పరమేశ్వరుడు సత్త్వరజస్తమో గుణాలతో నిండిన మాయాశక్తిని ఉపాధిగా చేసుకొని, జగత్కార్యం చేస్తూ ఉంటాడు. భగవానుడు మాయాశక్తికి ఉన్న రజోగుణాన్ని ఉపాధి చేసుకొని, బ్రహ్మరూపం దాల్చి జగత్తును సృజిస్తాడు. సత్త్వగుణోపాధితో విష్ణువై జగత్పాలన చేస్తాడు. తమోగుణోపాధితో రుద్రరూపం ధరించి జగత్సంహారం చేస్తాడు. అటువంటి మీ త్రిమూర్తులకూ నా నమస్కారాలు. కానీ, నేను మీలో ఒక్కరినే ధ్యానించాను. నేను ధ్యానించిన మూర్తి మీలో ఎవరిదో మీరే చెప్పండి.

“నేను సంతానం కోరి, నా మనసులో ఒక్క భగవంతుణ్నే ఏకాగ్రచిత్తంతో నిలిపి, రకరకాలైన ఉపచారాలతో ఆరాధించాను. మీరో, దేహధారుల మనసులకైనా అందని ఉత్తములైన దేవతలు. నేను ఒక్కరినే ఆరాధిస్తే, మీరు మువ్వురూ ఇక్కడికి రావటానికి కారణ మేమిటి? దయతో నాకీ విషయం తెలపండి. నాకీ విషయంలో గొప్ప ఆశ్చర్యం కలుగుతున్నది” అన్నాడు మహర్షి.

ఆయన మాటలు విని ఆ ముగ్గురూ నవ్వి, మధుర వచనాలతో ఇట్లా చెప్పారు. “ఓ మహర్షీ! నీవు సత్యసంకల్పం కలవాడివి. నీ సంకల్పం ఏ విధంగా ఉందో, అట్లాగే జరుగుతుందే తప్ప, మరొక విధంగా జరగదు. నీవు ఏ ఒక్క జగదీశ్వరుణ్ని ధ్యానించావో, ఆ దైవాలము మేమే! అది నిశ్చయం. మాలో భేదం లేదు. కనుక, నీకు మా అంశలతో

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

ముగ్గురు తనయులు కలుగుతారు. వారు ఈ లోకంలో ప్రసిద్ధి పొంది, నీ కీర్తినీ విస్తరింపజేస్తారు. నీకు మంగళం అవుతుంది." అని అన్నారు

దేవతోత్తములైన ఆ త్రిమూర్తులను మహర్షి విశేషంగా పూజించాడు. వారు ఆయన కోరుకున్న వరాన్ని అనుగ్రహించారు. అత్రి దంపతులు ఆ విధంగా చూస్తూ ఉండగానే త్రిమూర్తులు అంతర్హితులయ్యారు.

ఆ పైన అత్రి అనసూయ దంపతులకు బ్రహ్మ అంశతో చంద్రుడు, విష్ణువు అంశతో దత్తాత్రేయమహర్షి, శంకరుని అంశతో దుర్వాసమహర్షి జన్మించారు.

సంస్కృత భాగవతంలోను దత్తాత్రేయమహర్షిని గురించిన వివరాలు పెద్దగా లేవు. ఐనప్పటికీ, బ్రహ్మపురాణంలో లభించిన కొన్ని వివరాలను కూడా తెలుసుకుందాము.

భూతాత్ముడైన శ్రీమహావిష్ణువు, కేవలం క్షమాలక్షణమైన అవతారం దాల్చాడు. అదే దత్తాత్రేయ అవతారం. వేదాలు నశించి, యజ్ఞాలు, ప్రక్రియలు నాశనమయ్యాయి. నాలుగు వర్ణాలూ సంకరమైపోయి, ధర్మం శిథిలమై, అధర్మం పెచ్చుమీరింది. సత్యం చెడి, అసత్యం పెరిగిపోయింది.

అటువంటి సమయంలో దత్తాత్రేయుడు ఉద్భవించి, యజ్ఞాలతో, క్రియలతో వేదాలను పునరుద్ధరించాడు. చాతుర్వర్ణ వ్యవస్థను ఆ మహాత్ముడు కాపాడాడు. హైహయ రాజవంశంలోని వాడైన బుద్ధిమంతుడైన కార్తవీర్యునికి మూడు వరాలిచ్చాడు.

అందులో ఒకటి అతనికి వేయి చేతులు రావటం. రెండవది వసుంధర కంతటికీ పాలకుడు కావటం. మూడవది యుద్ధంలో అతన్ని శత్రువులు తేరిపార చూడలేకపోవటం.

శ్రీగురుచరిత్రలో దత్తాత్రేయుని మహిమలకు సంబంధించిన కథలున్నాయి. వ్యాసపూర్ణిమ నాడు జరిగే పూజలలో గురువుగా దత్తాత్రేయుడు కూడా నేటికీ పూజ లందుకుంటున్నాడు.

(సశేషం)

# శుభాశుభ నిర్ణయాలు -మీమాంస

(12 వ పేజీ తరువాయి)) స్థలము పశువృద్ధియు కల్గించును. వృత్తాకారముగా యున్న స్థలము యోగ్యమను ధనమును యిచ్చును. భద్ర పీఠాకారముగా యున్న స్థలము ఐశ్వర్యమును కలిగించును. త్రిశూలాకారముగ యున్న భూమి వీరులగు పుత్రులను యిచ్చును. ధన సౌఖ్యముల నిచ్చును. లింగాకారముగా యున్న భూమి లింగధారులకు వీరశైవులకును ప్రశస్తము.

శ్లో॥మనోహరా భూస్సుతదా దృఢా ధన ప్రదామతా।
సుతార్థదా తథా పృదక్ సురేశ దిక్ప్లవా మహి॥
గంభీరశబ్దా జనయేత్పుత్రాన్ గంభీర నిస్స్వనాన్
తుంగ పదాన్వితాన్ కుర్యాత్సమా సౌభాగ్యదాయినీ॥
వికటా శూద్ర జాతీనాం తథా దుర్గ నివాసినాం।
శుభదా నాపరేషాం చ తస్కరాణాం శుభావహీ॥
స్వవర్ణాస్యాత్స్వవర్ణనా సర్వేషా మధి పత్యదా।
శుక్ల వర్ణాచ సర్వేషాం పుత్ర పౌత్ర వివర్ధినీ॥
కుశ కాశాన్వితా బ్రహ్మ వర్చస్వాన్ కురుతే సుతాన్।
దూర్వాన్వితా వీరజనిః పలాఢ్యా ధన పుత్రదా॥


గృహ నిర్మాణము కావించు స్థలము మనోహరమైన స్థలము సంతాన వృద్ధిని కల్గించును. దృఢముగా వున్న భూమి ఐశ్వర్యమును, ఉత్తరము తూర్పు పల్లముగా వున్న స్థలము వంశవృద్ధిని ధనవృద్ధిని కలిగింప చేయును. గంభీరమయిన శబ్దము గల్గిన భూమి గంభీరమయిన పుత్రుల నుదయింపచేయును. ఉన్నతమయిన భూమి సౌభాగ్యములను కలిగింప చేయును. సమమయిన భూమి ఐశ్వర్యమును కలిగించును. వికట భూమి శూద్రులకు దుర్గ నివాసులకు తస్కరులకు శుభదముగా వుండును. యితరులకు నింద్యమయినది.

ప్రతి వర్ణస్థులకు తన వర్ణమునకు చెప్ప బడిన స్థలము శ్రేష్ఠ మయినది. అన్ని వర్ణముల వారికి తెల్లని భూమి పుత్ర పౌత్రాభివృద్ధిని కలుగచేయును. రెల్లును దర్భలు గల భూమి బ్రహ్మ వర్చస్సుగల పుత్రులు నుదయింపచేయును. గరికతో వున్న భూమి వీరులయిన సంతతిని, ఫల వృక్షములతో నున్న భూమి ధనవంతులగు పుత్రులను కలిగించును.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# శ్రీరామానుజ సిద్ధాంత సభ

డా. నల్లా శశిధర్ రామానుజ దాసన్, సంయుక్త కార్యదర్శి శ్రీరామానుజ సిద్ధాంతసభ, సికింద్రాబాద్.






శ్రీరామానుజ సిద్ధాంతసభ శ్రీవైష్ణవ సంప్రదాయ సిద్ధాంత ప్రచార, పరిరక్షణ కొరకై ఆవిర్భవించింది. 1990వ సంవత్సరం అక్టోబరు నెలలో జంటనగరాలలో నివసించే శ్రీవైష్ణవుల ప్రయత్నఫలంగా, పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ వానమామలై రామానుజజీయర్ స్వామి (29వ పట్టం), శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వారి మంగళాశాసనాలతో శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయం, సికింద్రాబాద్,నందు ప్రారంభించబడింది.

ఈ దేవాలయం దాదాపు 100 సంవత్సరాల చరిత్ర ప్రాశస్త్యం కలది. 25వ పట్టం శ్రీశ్రీశ్రీ వానమామలై కలియన్ రామానుజ జీయర్ స్వామివారిచే ఈ దేవాలయం ప్రతిష్ఠాపన చేయబడింది. ఆలయ వ్యవ్యస్థాపకులు శ్రీగుమిడెల్లి లక్ష్మీనారాయణ గారు. శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ పెద్దజీయర్ స్వామివారు భాగ్యనగరం వేంచేసినప్పుడల్లా ఈ దేవాలయములోనే బస చేసేవారు. శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారికి పూర్వాశ్రమములో ఈ దేవాలయములోనే పెద్దజీయర్ స్వామి వారిచే సమాశ్రయణములు అనుగ్రహించబడినవి.

శ్రీరామానుజ సిద్ధాంతసభ ప్రధాన లక్ష్యములు

భగవద్రామానుజ సిద్ధాంత ప్రచారము, శ్రీవైష్ణవ సంప్రదాయ పరిరక్షణ మరియు ప్రోత్సాహము. అర్హులైన శ్రీవైష్ణవ దేవాలయ కైంకర్యపరులకు ఆర్థిక సహాయం, శ్రీవైష్ణవ ప్రముఖ పండితులచే తిరుప్పావై, రామాయణ భాగవతాదుల, రహస్య గ్రంథములపై ప్రవచనములను ఏర్పాటు చేయుట, ఉత్సవములలో నాలాయిర దివ్యప్రబంధ అనుసంధానము, శ్రీవైష్ణవ గ్రంథములు, సాహిత్యము మరియు ఇతర ప్రచురణలకు ఆర్థిక సహాయము, తిరుప్పావై మరియు స్తోత్రపాఠములపై పిల్లలతో పోటీల నిర్వహణ, దేవాలయములలో ఉత్సవములలో సేవాసహకారం, భగవద్రామానుజ, మణవాళమామునుల తిరుఅవతార జయంతి వేడుకలు జరిపించుట, ఆయా ఉత్సవ విశేషాలు అందరికి తెలియ పరచుట, లోకకళ్యాణార్థం శ్రీసుదర్శనాది యాగముల నిర్వాహణ, జీయంగార్లను, ఆచార్య పురుషులను మరియు శ్రీవైష్ణవ కోవిదులను గౌరవించుట, సనాతన ధర్మాన్ని సమర్థించే వారికి సహకారం చేయుట, ఇలా ఎన్నో సంప్రదాయ కార్యక్రమాలను జరిపిస్తున్నది. ఈ ఆశయాలకు, ఉద్దేశ్యాలకు అనుగుణంగా శ్రీరామానుజ సిద్ధాంతసభ ఈ క్రింది జీయర్ స్వాములను, పండితులను ఆహ్వానించి గౌరవించింది.




1) శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీవానమామలై జీయర్ స్వామి (29వ పట్టం), 2) శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి, 3) ఉ.వే. శ్రీమాన్ ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్, పుత్తూర్ శ్రీరంగం, 4) శ్రీశ్రీశ్రీ అళియశింగర్ అహోబిల జీయర్ స్వామి, 5) శ్రీమాన్ సర్వోపకార శెట్టి, శ్రీరామానుజ

సుప్రభాతగోష్ఠి,మద్రాసు, 6) ఉ.వే. శ్రీమాన్ శ్రీ వేంకటేశ అయ్యంగార్ (ఎస్.పి.పి. ఎస్.) కమిటీ, 7) శ్రీశ్రీశ్రీ ఆండవన్ జీయర్ స్వామి, ఆండవన్ ఆశ్రమం, 8) ఉ.వే. శ్రీమాన్ ముదలి యాండాన్ స్వామి, కాంచీపురం, 9) ఉ.వే. శ్రీమాన్ తిరుమణి స్వామి, శ్రీపెరుంబుదూర్, 10) ఉ.వే. శ్రీమాన్ వేలుక్కుడి కృష్ణన్ స్వామి, శ్రీరంగం, 11) ఉ.వే. శ్రీమాన్ ఇళైయవిల్లి శ్రీనివాస భూవరాహాచార్య స్వామి, ఆళ్వార్ తిరునగరి, 12) ఉ.వే. శ్రీమాన్ అరయర్ స్వామి, ఆళ్వార్ తిరునగరి, 13) ఉ.వే. శ్రీమాన్ శఠకోపాచార్య స్వామి, తిరువాయ్ మొళిప్పిళ్ళైస్వామి, ఆళ్వార్ తిరునగరి, 14) ఉ.వే. శ్రీమాన్ వి.వి. రామానుజమ్ స్వామి, సంపాదకులు, యతిరాజ పాదుక, 15) శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య వానమామలై జీయర్ స్వామి, వానమామలై మఠం (30పట్టం), 16) శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య వానమామలై జీయర్ స్వామి, వానమామలై మఠం, 17) ఉ..వే. శ్రీమాన్ ఎం.ఎ. వెంకటకృష్ణన్ స్వామి, చెన్నై, 18) ఉ.వే. శ్రీమాన్ అయోధ్య మహంత్ స్వామి, 19) ఉ.వే. శ్రీమాన్ గోమఠం పాలూర్ మన్నార్ కోయిల్ వడక్కు తిరుమాళిగై, శ్రీమాన్ మణవాళమునిగళ్ వంశావళి శ్రీరామానుజాచార్యర్‌స్వామి, 20) కీర్తిమూర్తులు పరమహంస పరివ్రాజకాచార్య తిరుమలై తిరుపతి పెరియకేళ్వి జీయర్‌స్వామి, తిరుమల, 21) ఉ.వే. శ్రీమాన్ రమాకాంతాచార్య స్వామి, 22) శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి, 23) ఉ.వే. శ్రీమాన్ బదరీనారాయణ భట్టర్ స్వామి, శ్రీరంగం 2007-2008, 24) ఉ.వే. శ్రీమాన్ మేల్కొటె సంపత్కుమారాచార్య స్వామి, 2007-08, 25) ఉ.వే. శ్రీమాన్ ఎం.ఏ. వెంకట కృష్ణన్ స్వామి, సంపాదకులు, గీతాచార్యన్, చెన్నై, 26) పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ యతిరాజ రామానుజ జీయర్ స్వామి, శ్రీపెరుంబూదూర్, 27) ఉ.వే. శ్రీమాన్ అక్కారక్కని శ్రీనిధిస్వామి, కాంచీపురం, 28) శ్రీమాన్ అనంతాచార్యులు, తిరునారాయణపురం, 29) ఉ.వే. శ్రీమాన్ కపిస్థలం శ్రీనివాసాచార్యస్వామి, శ్రీరంగం వీరేకాక ఇంకా పలువురు జీయర్‌స్వాములు, పండితులు సమ్మానింపబడ్డారు.

ఇతర సాంప్రదాయ కార్యక్రమములు

పిళ్ళైలోకాచార్యుల 800వ తిరునక్షత్ర సందర్భముగా, పెరియ వాచ్చాన్ పిళ్ళై 850 తిరునక్షత్ర సందర్భముగా, శ్రీమణవాళమామునుల 650వ తిరునక్షత్ర సందర్భముగా వారు కృపచేసిన కొన్ని గ్రంథాలకు వాఖ్యానమునులను ముద్రణచేయడం జరిగినది. అలాగే వారి వైభవమును ప్రముఖ ఉ.వే పండితులచే ఉపన్యాసముగా (తెలుగు మరియు తమిళ) అందచేయడం జరిగినది.

ప్రత్యేకముగా కూరత్తాళ్వాన్ సహస్రాబ్దికి, శ్రీరామానుజ సహస్రాబ్దికి, శ్రీమన్నాథమునుల 1200 సంవత్సరముల తిరునక్షత్ర సందర్భముగా వారి వైభమును చాటి చెప్పే విధంగా ఉత్సవములు మరియు ఉపన్యాసములు గ్రంథ ముద్రణలు ఏర్పాటు చేయడం జరిగినది. శ్రీకూరములో ఒక రోజు తదీయారాధన నిమిత్తముగా 3 లక్షల కైంకర్యమును సమర్పణ, పంచస్తవముల పై సి.డిల విడుదల.

ఇతిహాస పురాణ దివ్యప్రబంధ విద్వత్ సదస్సులు స్వతాహాగా మరియు తిరుపతి తిరుమల దేవస్థానం సౌజన్యముతో ఏర్పాటు. శ్రీ ఉ.వే శింగరాచార్య స్వామివారిచే దివ్యప్రభంధములను తెలుగు వ్యాఖ్యానములో అనువదింప చేసి పుస్తకరూపములో ముద్రించబడినాయి. శ్రీవైష్ణవ ఆచార్య సేవా భాగములో, శ్రీవానమామలై జీయర్ 19వ పట్టం శ్రీశ్రీశ్రీ పెరియ పట్టర్ పిరాన్ రామనుజ జీయర్‌స్వామి వారు శ్రీసీతారాం బాగ్ దేవాలయానికి విచ్చేసి, వయో భారంతో వారు ఇక్కడే పరమపదించారు, వీరి తిరువరసు శ్రీసీతారాం బాగ్ దేవాలయమున ఉన్నది. చాల జీర్ణావస్థలో ఉండెను, దేవాలయ యజమానిని ప్రార్థించి దానిని పునరుద్ధరణ చేసి వారి తిరునక్షత్రం తిరువాడిప్పూరం మరియు తీర్థోత్సవం కార్తీక చవితిన సిద్ధాంత సభ ద్వారా ప్రతి సంవత్సరం అతివైభముగా జరిపించడం జరుగుతుంది. శ్రీరామానుజ సిద్ధాంతసభద్వారా చేయు దివ్యదేశ కైంకర్యములు: తిరువహీంద్రపురం దివ్యదేశములో ఈడు ఉత్సవములో మొదటి రోజు ఉభయదారులుగా కైంకర్యము, అష్టభుజం దివ్యదేశములో దేవాలయ సంప్రోక్షణలో కైంకర్యము, తిరువాళి తిరునగరి 12 దివ్యదేశములకు పుష్పకైంకర్యము నకు ప్రతిమాసం కణ్ణన్ (మాలలు కట్టే స్వచ్ఛంధ కైంకర్యపరులు) అనే భాగవతునకు 8-10 వేలు పంపించబడుతుంది. విశేష ఉత్సవములు ఉన్నప్పుడు 12 దివ్యదేశములకు బెంగుళూరు నుండి ప్రత్యేకముగా సంపంగి పూలను అందచేయబడుతుంది, ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలను అందరి సహకారంతో జరిపించాలని భగవానుని పాదపద్మముల యందు ప్రార్థిస్తూ...

రామానుజార్య దివ్యాజ్ఞ వర్ధతాం అభివర్ధతాం! ★

# అంతా నృసింహ మయమే



## శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు

శ్రీమద్భాగవతం ఏడవ స్కంధం ప్రారంభములో పరీక్షిత్ మహా రాజు (అసలు పేరు విష్ణురాతుడు) శుక మహర్షిని ఒక ఆసక్తికరమైన ప్రశ్న అడగటంతో ప్రహ్లాద చరిత్ర, శ్రీనృసింహ స్వామి ఆవిర్భావం తదితర అంశాలు విస్తారముగా తెలియ చేయబడ్డాయి. ఆ ప్రశ్న ఏమిటి? దానికి శుక మహర్షి సమాధానం ఏమిటి? అనే విషయాలను సంక్షిప్తముగా తెలుసుకుని తదుపరి కొన్ని దృష్టాంతముల ద్వారా "అంతా నృసింహ మయమే" అనే విషయాన్ని అనుభవిద్దాము. పరీక్షిత్ మహారాజు ప్రశ్న ఇలా ఉన్నది. "సమః ప్రియః సుహృత్ బ్రహ్మన్ భూతానాం భగవాన్ స్వయం। ఇంద్రస్యార్థే కథం దైత్యాన్ అవధీత్ విషమో యథా॥" అందరిపట్ల సమబుద్ధి కలవాడు, నావాడు పైవాడు అనే తేడా లేనట్టివాడు, ప్రేమ స్వరూపుడు, సకల ప్రాణులకూ హితము చేయువాడు అయినటువంటి భగవానుడు శ్రీమన్నారాయణుడు. అట్టి స్వామి భేదబుద్ధి కలవానివలె ఇంద్రుని ప్రయోజనము కొరకు రాక్షసులను వధించునట్లుగా అనేక చోట్ల కన్పట్టుచున్నది. ఇది ఏల స్వామీ! అని అర్ధము. అపుడు శుక మహర్షి సంతోషించి "ఆశ్చర్యము గొలిపే పరమపవిత్రమైన శ్రీహరిగాథను నారదాది మహర్షులు గానం చేస్తూ ఉంటారు. నా తండ్రిగారైన వ్యాసమహర్షికి నమస్కరించి నీవడిగిన విషయాన్ని గూర్చి చెపుతాను విను". అని ప్రారంభిస్తూ తన తండ్రియైన హిరణ్యకశిపునిచే పలువిధములయిన శిక్షలకు గురిఅయి కూడా శ్రీమన్నారాయణుని కృపాకటాక్షములచే రక్షింపబడ్డవాడైన ప్రహ్లాదుడు "ఎక్కడ నీ హరి?" అని అడిగిన తన తండ్రికి సమాధానముగా "అంతః ప్రవిష్ట శాస్తా జనానామ్" అనే ఉపనిషత్ వాక్యార్థముగా పరమాత్మ యొక్క సర్వాంతర్యామిత్వాన్ని చెపుతాడు. ఆగ్రహించిన హిరణ్య కశిపుడు కత్తి పట్టుకుని సింహాసనము నుండి వేగముగా పైకి లేచి తన పిడికిలితో స్తంభమును కొట్టగా గంగాళము వంటి బ్రహ్మాండము పగిలినదా అనిపించెను. ఆ సమయములో సకల చేతనాచేతనములయందు అంతర్యామిగా ఉన్న శ్రీహరి అత్యద్భుతముగా ఆశ్చర్యము గొలిపే రీతిలో నరుడూ కాదు మృగమూ కాదు అన్న చందంగా నరసింహుడై సభా మధ్యమున ఆవిర్భవించెను. శిష్టుడు, భాగవతోత్తముడు, నిజ భక్తుడు అయిన ప్రహ్లాదుని రక్షించి దుర్మార్గుడైన హిరణ్యకశిపుని వధించి తన సర్వాంతర్యామిత్వమును ప్రకటించిన మిక్కిలి అమృతమయమైనదే శ్రీనృసింహ అవతారము.



"అంతా నృసింహ మయమే" శ్రీనృసింహ అనుష్టుప్ మాహాత్మ్యం: పూర్వం ఈ ప్రపంచం ఏదీ లేదు. స్వర్గం అంతరిక్షం పృథివీ అనే విభాగాలూ లేవు. కేవలం జ్యోతి రూపమైనది, ఆది అంతాలు లేనిది, తెలియశక్యం కానిది, జ్ఞాన రూపమైనది, ఆనందరూపమైనది మాత్రమే ఉండేది. ఆ రూపం ఆకుపచ్చ ఎరుపు అనే రెండు రంగుల కలయిక వల్ల బంగారు అండముగా ఏర్పడినది. అందునుండి జన్మించిన వాడే పరమేష్ఠి లేదా హిరణ్యగర్భుడు లేదా బ్రహ్మ అనే పేర్లతో పిలువబడుతున్నాడు. నన్నెవరు సృష్టించారు? నేనేమి చేయవలె? అనే జిజ్ఞాస కలిగిన ఆ పరమేష్ఠికి తపస్సుతో నన్ను తెలుసుకో అని ఆశరీరవాణి తెలిపిన పిదప అతడు వేయి సంవత్సరాలు తపస్సు చేసి అనుష్టుప్ ఛందస్సులో ఉన్న పరమవిద్యను దర్శించాడు (తెలుసుకున్నాడు). సర్వ మంత్రాలు దానికి అంగ భూతమైనవే. అట్టి మంత్రమే "ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖమ్ నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుమ్ నమామ్యహమ్ అనే శ్రీనృసింహ

# అంతా నృసింహ మయమే

అనుష్టుప్.

తపః ఫలితముగా శ్రీనృసింహ దివ్యమంగళ విగ్రహాన్ని బ్రహ్మ దర్శించాడు. ఆ స్వామి మహాలక్ష్మీ సహితుడై, గరుడ వాహనుడై, ఆదిశేషుని పడగలచే కప్పబడినవాడై (ఫణిపతి: శయ్యాసనం వాహనం వేదాత్మా విహగేశ్వర: అన్న చందంగా), మృగముఖం, సూర్యచంద్రుల్లాంటి నేత్రాలు కలవాడై (కదిరి మతియంబోల్ ముకత్తాన్ - హిరణ్యకశిపుని నిగ్రహించుటకు తీక్షణమైన చూపులునూ అదే సమయంలో ప్రహ్లాదుడిని కటాక్షించుటకు చల్లనైన చూపులునూ) ప్రకాశించాడు. అట్టి స్వామిని బ్రహ్మదేవుడు నమస్కరించి, స్తుతించి, అర్చించాడు. అతడు మృగరూపుడు కనుక "ఉగ్రం" అన్నాడు, వీర్యవంతుడు కనుక "వీరం" అన్నాడు, మహత్తుకు ఆవలి వాడు మరియు భూమ్యాకాశాలు వ్యాపించి ఉన్నాడు కాబట్టి "మహావిష్ణుం" అన్నాడు, జాజ్జ్వల్యమానంగా ప్రకాశిస్తున్నాడు కనుక "జ్వలంతం" అన్నాడు, విశ్వరూపుడై అన్ని వైపులా ముఖాలు కలవాడు కనుక "సర్వతోముఖమ్" అన్నాడు, నర రూపుడు సింహ రూపుడు కనుక "నృసింహం" అన్నాడు, అతని భయం వల్లనే సూర్య, చంద్ర, అగ్ని, వాయు, మేఘాదులు తమతమ కర్తవ్యాలు సక్రమంగా నిర్వహిస్తున్నారు కనుక "భీషణం" అన్నాడు (భీషాస్మాత్ వాతఃపవతే భీషోదేతి సూర్యః భీషాస్మాదగ్నిశ్చేంద్రశ్చ మృత్యుర్ధావతి పంచమ ఇతి అనే తైత్తిరీయ ఉపనిషద్వాక్యము స్మరణీయం). మంగళకరుడు మహాలక్ష్మీ సహితుడు కనుక "భద్రం" అన్నాడు. మృత్యువునకే మృత్యువు కనుక "మృత్యుమృత్యుమ్" అన్నాడు. భక్తులకు అమృతత్వాన్ని ప్రసాదించే స్వామి కనుక "నమామి" అన్నాడు. ఉపనిషత్తుల్లో "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని చెప్పబడిన రీతిగా అంతా ఆ స్వామియే అయి ఉన్నాడు కాబట్టి "అహం" అన్నాడు. అట్టి "ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖమ్। నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుమ్ నమామ్యహమ్॥" అనే అనుష్టుప్‌ను ప్రణవముతో ధ్యాన పూర్వక యజ్ఞము చేసి లోకాలను, ప్రజాపతులను సృష్టించాడని మనకు శ్రీనృసింహ ఉపనిషత్తుల ద్వారా తెలుస్తుంది (అవ్యక్తోపనిషత్, శ్రీనృసింహ తాపన్యుపనిషత్ ఇత్యాదివి). కాబట్టి అంతా నృసింహ మయమే అని స్పష్టమైనది.

శ్రీవిష్ణు సహస్రనామం అంతా నృసింహ వైభవమే:

శరతల్పగతో భీష్మః శామ్యన్నివ హుతాశనః।

మాం ధ్యాతి పురుషవ్యాఘ్రః తతోమే తద్గతం మనః॥

భారతయుద్ధము ముగిసిన తరువాత ఒకరోజు ధర్మరాజు శ్రీకృష్ణుని కలవటానికి వస్తాడు. అపుడు ధ్యానంలో ఉన్న శ్రీకృష్ణుని చూచిన ధర్మరాజు "యోగులు మరియు భక్తులచేత ధ్యానింపబడే నీవు ఎవరి గురించి ధ్యానము చేస్తున్నావో తెలియచేయల్సినది శ్రీకృష్ణా" అని ప్రార్థిస్తాడు. అపుడు శ్రీకృష్ణుడు ఇలా అంటాడు "శరతల్పముపై పడుకుని ఆరిపోయే అగ్నిహోత్రము వలెనున్న మరణించుటకు సిద్ధముగా ఉన్న పురుషశ్రేష్ఠుడు అయన భీష్ముడు నన్ను ధ్యానిస్తున్నాడు. నా మనసు అతని వద్దకు వెళ్ళినది" అని. అటుపై శ్రీకృష్ణుని ప్రేరణచే ధర్మరాజాదులు వెళ్ళి భీష్ముని వద్ద అనేక ధర్మములు తెలుసుకున్నవారై తదుపరి అన్ని ధర్మములలోకెల్లా నీకిష్టమైన (అభిమతమైనది మరియు శ్రేయస్కరమైనది) ధర్మమేది తాతా అని అడిగిన ధర్మరాజునకు శ్రీకృష్ణుని సమక్షంలో వెల్లడించిన శ్రీవిష్ణుసహస్రనామముల గురించి మనందరికీ తెలుసు. అందులో ప్రప్రథముగా శ్రీమన్నారాయణుని దశావతారములలో ముందుగా మూడవ శ్లోకములోనే తెలుపబడినది శ్రీనృసింహ నామము.

యోగో యోగ విదాంనేతా ప్రధాన పురుషేశ్వరః।

నారసింహవపుశ్శ్రీమాన్ కేశవః పురుషోత్తమః॥ పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు ఎదురుగా ఉండగా మొట్టమొదట కీర్తించిన అవతారము శ్రీనృసింహ అవతారము. అంతేకాదు చివరగా "సర్వప్రహరణాయుధః" ఆశ్రితులను రక్షించుటలో వివిధము లైన ఆయుధములు కలిగినవాడు అనే చివరినామం కూడా శ్రీనృసింహ స్వామి అవతారంలో నఖములలో (గోరు) శ్రీసుదర్శన ఆయుధము కలిగిన స్వామి పరంగా అన్వయించుకుని మొదటా చివరా నృసింహుడినే చెప్పటం వల్ల శ్రీవిష్ణు సహస్రం అంతా శ్రీనృసింహ వైభవమే అనటంలో అతిశయోక్తి ఎంత మాత్రమూ లేదు అని స్పష్టమవుతున్నది.

(పెరియాళ్వార్ ఆనతిచ్చిన తిరుప్పల్లాండులో శ్రీనృసింహ వైభవం, శ్రీఆండాళ్ ఆనతిచ్చిన ప్రబంధములలో శ్రీనృసింహ వైభవం, నాచ్చియార్ తిరుమొళిలో శ్రీనృసింహ వైభవ విశేషాలు వచ్చే సంచికలో తెలుసుకుందాము) (సశేషం)

# ఋషిపత్ని పరిపూర్ణ భక్తి

## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూరు పెణ్ పిళ్లై చెప్పిన 81 వాక్య రత్నములలో మూడవ భక్తురాలు ఋషి పత్నిని గురించి ఆమె ఈ విధంగా తెలియజేసింది.**

"దేహత్తై విట్టేనో ఋషి పత్నియై పోలే"

భగవానుడైన శ్రీకృష్ణుని విడిచి వెళ్లలేక పోయిన ఋషిపత్ని వలె నేనేమైనా దేహాన్ని వదిలానా? అంటూ ఋషి పత్ని యొక్క వృత్తాంతాన్ని ఆ మహనీయురాలు ఈ విధంగా తెలిపింది.

ఒకసారి శ్రీకృష్ణుడు బృందావనమున గోపాలురతో కలిసి ఆవులను మేపుటకు వెళ్లారు. యమునా నదిలో పశువులకు చల్లని నీటిని త్రాగించి వాటిని మేపుతూ అనేక ఆటలు ఆడి గోపాలబాలకులు అలసిపోయారు. అప్పుడు వారు కన్నయ్యతో తమకు ఆకలి వేస్తోందని విన్నవించుకున్నారు. శ్రీహరి తన భక్తులైన బ్రాహ్మణపత్నులను అనుగ్రహించదలచి ఓ గోపబాలకులారా! కనపడుతున్న ఆ వనంలో వేదవేత్తలైన బ్రాహ్మణులు "ఆంగీరస" మనే సత్రయాగం చేస్తున్నారు. వారి వద్దకు వెళ్లి నా పేరు, అన్నగారి పేరు చెప్పి అనురాగపూర్వకంగా వారిని అన్నం కావాలని అడగండి. అందరం కలిసి భుజించుదాం అని పలికాడు. గోపబాలకులు ఆ బ్రాహ్మణలను వెళ్లి అడిగగా అన్నం లేదని వారు అదిలించారు. వేద మంత్రములు, హవిస్సులు, సంక్రమణములు, మొదలగు పుణ్యకార్యములు. కాశి మొదలగు దివ్య స్థలాలు. యాగఫలమైన ధర్మము. ఈ సమస్తము కూడా మహావిష్ణువు స్వరూపాలై ఉన్నవో ఆ మహా విష్ణువే శ్రీకృష్ణుడు అన్నది అజ్ఞతవల్ల వాళ్ళు భావించ లేకపోయారు.

శ్రీకృష్ణుని కేవలం గోప బాలకుడనే తలంచారు వారు. అప్పుడు గోప బాలకులు నిరాశతో మరలి వచ్చి శ్రీకృష్ణునికి ఈ విషయం విన్నవించారు అంత గోవిందుడు వారితో మీరు మరల ఆ పెద్దలను అడగకండి! రామకృష్ణులు ఈ వనానికి వచ్చారని వారి పత్నులకు చెప్పండి అని గొల్ల పిల్లలను పంపించారు. వారంతా యజ్ఞ వాటికకు వచ్చి ఋషిపత్నులను దర్శించి నమస్కరించారు. గోప బాలకులను ఆదరించిన ఋషి పత్నులతో వారు "శ్రీకృష్ణుడు గోవులను మేపుతూ ఆకలిగా ఉందని మీ వద్దకు పంపాడు వచ్చి అన్నం పెట్టండి అమ్మ రండి!" అన్నారు.

గోప బాలకుల మాటలు వింటూనే శ్రీకృష్ణుని దర్శించు



**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

కోవాలని సంతోషంతో సంబరంతో ఆ బ్రాహ్మణ స్త్రీలు అందరూ భక్షములు భోజ్యములు లేహ్యములు చోష్యములు అనే నాలుగు విధాల ఆహారాలు రకరకాల పానీయాలు వండిన అన్నం పాత్రలలో నింపుకొని సాగరుని చేరే నదుల వలె స్త్రీలంతా ఉత్సాహంతో బయలుదేరారు. పతులు బిడ్డలు తోబుట్టువులు అడ్డం వచ్చి వెళ్ళొద్దని వారిస్తున్నా జగన్నాథునికి అన్నం తీసుకుని వారంతా వెళ్ళిపోయారు. యమునా సమీపాన అశోక వృక్షం కింద విలాసంగా ఒక చేతితో పద్మాన్ని తిప్పుతున్న నంద నందనుడు ఎలా ఉన్నాడో వర్ణిస్తున్నారు. తల చుట్టూ నెమలిఫించము మెడలో వనమాల పచ్చని పీతాంబరముతో జగత్తును సమ్మోహపరిచే ఆ హరి యొక్క దివ్య స్వరూపమును కళ్ళతోనే వారి హృదయ మందిరాలలో ప్రవేశపెడుతున్నారు. ఎప్పుడైతే వారిని హృదయ మందిరాలలో శ్రీకృష్ణుని ప్రవేశింప చేసుకున్నారో ఆక్షణమే ఆధ్యాత్మిక, ఆది భౌతిక, ఆది దైవికమనే (త్రివిధ) మూడు తాపాలు ఉపశమించి వారిని హృదయాలతోనే ఆలింగనము చేసుకున్నాడు శ్రీకృష్ణుడు. ఈ రీతిగా తహతహలాడుతూ తనను దర్శించవచ్చిన ఋషిపత్నులను చూసి నవ్వి అందరి కుశలము అడిగి ఫలాపేక్ష లేక వచ్చిన మీరు అన్నిటినీ పొందగలరు వెళ్లి మీ భర్తలతో యాగం నెరవేర్చండి! అనగా వారంతా "లక్ష్మీ మనోహరా! నీ పాదాల చెంత చేరాము.

(మిగతా 34 వ పేజీలో)

# "రామాయణ మహాక్రతువు" ఆహ్వానం



మన జన్మకు ముఖ్యమైన ప్రయోజనం భాగవత దర్శనం, భాగవత సహవాసం, భగవద్గుణాను భవం, భగవన్నామ స్మరణం, భాగవత సేవ. వీటిని ఆచరించి తరించడానికి మనమందరం "రామాయణ మహాక్రతువు"లో శ్రీరాముని గుణ గుణాలను అనుసంధిస్తూ ఆ పతిత పావనుడైన శ్రీరామచంద్రున్ని ఆరాధిద్దాం.

మనమందరం లోక కల్యాణార్థం జరిగే ఈ పవిత్ర ఉత్సవాలలో యథాశక్తిగా అన్ని కైంకర్యములలో భాగస్వామ్యము స్వీకరిస్తూ, మన మిత్ర, బంధువర్గము వారినందరిని కూడా కైంకర్యములో పాలుపంచుకునేటట్లుగా ప్రోత్సహిద్దాం. మనమంతా బాధ్యతను స్వీకరించడానికి సన్నద్ధులమవుదాం. "దీక్షా స్వీకారము" చేసి, తమ తమ కామ్యార్థములు తీర్చుకొని భగవత్ భాగవత ఆచార్య కృపకు పాత్రులమవుదాము రండి! అని మీ అందరికీ సాదరంగా సభక్తి పూర్వకంగా స్వాగతము పలుకుతుంది శ్రీమద్రామాయణ క్రతువు ఉత్సవ నిర్వాహణ సమితి.

(వైదిక కార్యక్రమాలు అన్నీ "శ్రీ ఉ.వే. శ్రీమాన్ తూపురాణి శ్రీరమణి రంగాచార్య స్వామి" వారి ప్రత్యేక్ష పర్యవేక్షణలో జరుగుతాయి).

కార్యక్రమవివరములు:
వేదిక: పి.వి.ఆర్ ఫంక్షన్ హాల్,
శాతవాహన యూనివర్సిటీ దగ్గర,
మల్కాపూర్ రోడ్, కరీణ్ణగరమ్

**తేది 04-05-2024 శనివారం నుండి**
**14-05-2024 మంగళవారం వరకు**

శ్రీమద్రామాయణ పారాయణ సహిత మహాక్రతువు నవాహ్నిక ఏకకుండాత్మకంగా జరుగుతుంది.

శ్రీమాన్ తూపురాణి శ్రీరమణి రంగాచార్య స్వామి,
మరియు నిర్వహణ కమిటీ, కరీంనగర్

# సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవము
## ఏకోత్తర సహస్రకలశాభిషేక మహోత్సవమ్

ప్రియ భగవద్బంధువులారా !

సైదాబాద్, భాగ్యనగరములో దేవాలయ ప్రతిష్ఠ నుండి ఈ సంవత్సరం నాల్గవ పుష్కర సంవత్సర కాలము కాబట్టి 14-05-2024 నుండి 23-05-2024 వరకు సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవము జరుపుకుంటున్నాము. మరియు తేది: 25-05-2024 రోజున (1001) ఏకోత్తర సహస్రకలశాభిషేక మహోత్సవము జరుప తలపెట్టాము,

ఈ మహోన్నత కార్యక్రమమునకు తమ సహాయ సహకారములు అందచేసి ప్రత్యక్షముగాను పరోక్షముగాను పాల్గొని శ్రీ సీతారాముని కృపకు పాత్రులు కాగలరని మనవి.

9 రోజులు "శ్రీ రామాయణ పారాయణము"

4 హోమ కుండాలలో హోమము, వేద పారాయణం, దివ్య ప్రబంధాది పారాయణములు జరుగును. 9 రోజులు 9 మంది జీయర్ స్వాములు, పండితులు విచ్చేసి శ్రీ రామాయణ ప్రవచనములు కృప చేసి మంగళాశాసనములు అనుగ్రహిస్తారు. శ్రీశ్రీశ్రీ త్రిదండిచిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి మంగళాశాసనములతో శ్రీపాఞ్చరాత్రాది ఆగమోక్త ప్రకారము "ఆగమసార్వభౌమ" శ్రీమద్వాధూల సముద్రాల రమాకాన్తాచార్య స్వామి వారి ఆచార్యత్వమున నవాహ్నిక దీక్షతో నిర్వహింపబడును.

సదా స్వామి వారి సేవలో...

శ్రీమత్ ఉభయ వేదాంతాచార్య పీఠము ట్రస్టుబోర్డు
శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయము
సైదాబాద్ కాలనీ, భాగ్యనగరము - 59.



# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక



ఆగ్నేయంలో, దక్షిణ ఆగ్నేయం నుంచి నైఋతి వరకు పెట్టే ద్వారాలలో అది 24 అడుగుల అనుకుంటే మొదటి ఎనిమిది అడుగులు దక్షిణ ఆగ్నేయం. రెండవ ఎనిమిది అడుగులు దక్షిణం. మూడవ ఎనిమిది అడుగులు నైఋతి. మొదటి ఎనిమిది అడుగుల అంటే దక్షిణ ఆగ్నేయంలో ఆగ్నేయం నుంచి దక్షిణం, నైఋతి వరకు ఉండే మూడు భాగాలలో 24 అడుగులు మూడు భాగాలు చేస్తే మొదటి ఎనిమిది అడుగుల దక్షిణ ఆగ్నేయం. ఇక్కడ ద్వారం పెట్టుకోవచ్చు. రెండవ ఎనిమిది అడుగులు దక్షిణం. ఆ దక్షిణంలో చివర్లో కాకుండా ఎనిమిది అడుగులను గణిస్తే మొదటి ఎనిమిది అడుగుల తర్వాత, ఆరడుగుల లోపల దక్షిణద్వారం పెట్టుకోవచ్చు. లేదా ఏడు అడుగుల వరకు పెట్టుకోవచ్చు. చివరకు పెట్టకూడదని. ఎందుకంటే నైఋతి ఛాయ ఏర్పడుతుందని. అలాగే దక్షిణం నుంచి మీగతా ఎనిమిది అడుగులు నైఋతి వస్తుంది కనుక అక్కడ ద్వారం ఉంచరాదు అని శాస్త్రం చెప్తుంది. అట్లాగే పశ్చిమ భాగాన్ని వెళితే నైఋతి నుంచి వాయువ్యం వరకు మూడు భాగాలు చేస్తే అది 24 అడుగులే ఉదాహరణ. మొదటి ఎనిమిది అడుగులు నైరుతి రెండవ ఎనిమిది అడుగులు పశ్చిమము. మూడవ ఎనిమిది అడుగులు పశ్చిమ వాయవ్యం. మొదటి ఎనిమిది అడుగులు నైఋతిలో ద్వారం పెట్టకూడదు అని. రెండవ ఎనిమిది అడుగులు పశ్చిమంలో ద్వారాన్ని ఉంచవచ్చు అని, అట్లాగే మూడవ ఎనిమిది అడుగులు పశ్చిమ వాయువ్యంలో ద్వారాన్ని పెట్టుకోవచ్చు అని చెప్పబడింది. వాయువ్యం నుంచి ఈశాన్యం వరకు ఉత్తర ముఖంగా పెట్టే ద్వారాలలో అది 24 అడుగులు ఉంది అనుకుందాం. అది వాయువ్యం నుంచి ఉత్తర వాయవ్యం ఎనిమిది అడుగులు ఉత్తర వాయువ్యంలో అవుతుంది. ఆ తర్వాత ఎనిమిది అడుగులు ఉత్తరం అవుతుంది. ఆ తర్వాత ఎనిమిది అడుగులు ఉత్తర ఈశాన్యం. ఉత్తరంలో గాని, ఉత్తర ఈశాన్యంలో గాని ద్వారాలు పెట్టుకోవచ్చు. ఉత్తర వాయవ్యంలో పెట్టకూడదు. ఒక ద్వారాన్ని మన ఉత్తరంలో

అంటే ఎనిమిది అడుగులలో పెట్టినప్పుడు దాని పక్కనే అటు ఇటు గవాక్షాలు అంటే కిటికీలు కూడా పెట్టుకోవడం ద్వారా చక్కని ఫలితాలు వస్తాయి. తూర్పు ద్వారానికి ఆ పక్కన ఈ పక్కన కిటికీలు పెట్టడం ద్వారా కూడా క్షేమకరమైన ఫలితం వస్తుంది. దక్షిణ, పశ్చిమ ద్వారాలకు కూడా ఇదే పద్ధతిలో రెండు గవాక్షాలు పెట్టుకుంటే మంచి ఫలితాలు వస్తాయి. "సమసంఖ్యా శుభం[ప్రోక్తం అశుభం విశమం తథాః" అని సరిసంఖ్యలో కిటికీలు, ద్వారాలు, వెంటిలేటర్లు, కబోర్డ్స్ ఉండడం ద్వారా ఆ గృహంలో శుభదాయకంగా ఉంటుంది. క్షేమంగా ఉంటుంది అని చెప్పబడుతుంది ద్వార వాస్తులో.

ఈ ద్వారం ఏ ప్రమాణంలో ఉండాలి. సింహద్వారం ఏ ప్రమాణంలో ఉండాలి. గదుల ద్వారాలు ఏ ప్రమాణంలో ఉండాలి. ఆ తర్వాత ద్వారాన్ని అనుసరించి కిటికీలు కూడా ఎంతలో ఉండాలి. ద్వారం యొక్క వెడల్పు పొడవు బట్టి చక్కని గాలి వెలుతురు సోకేట్టుగా, సింహద్వారం ఒక ఏడడుగుల ఎత్తు పెట్టి నాలుగు అడుగుల వెడల్పు తో లోపలి కొలతలు. దానికి ఆ వెడల్పుతో సమానమైన కిటికీలను ఆ పక్కన ఈ పక్కన ఉంచవచ్చు. ద్వారమంత ఎత్తు అవసరం లేదు గాని ద్వారం వెడల్పు ఎంత ఉందో లోపల్లోపల అంతట కిటికీలు సింహద్వారానికి కుడి ఎడమ పార్శ్వ మందు పెట్టుకోవడం ద్వారా ఆ కిటికీలకు ద్వారం మధ్య ఒక మూర అంటే సుమారుగా 18 అంగుళాలు దూరంగా వదిలి గాని 14 అంగుళాలు దూరంగా వదిలి గాని చివరకు ఒక పన్నెండు అంగుళాల దూరంగా కిటికీలు ఏర్పాటు చేయడం ద్వారా చక్కని ఫలితాలు వస్తాయి. ఇందులో ఇంకా సూక్ష్మంగా ఏ స్థానంలో ఈ గ్రహ స్థానము, ఏ దిశలో ఏ గ్రహాలు ఉంటాయి. నవ గ్రహాలను అనుసరించి కూడా ఆ ద్వారాలు ఎలా పెట్టుకోవాలి అనే విషయాన్ని ఇంకా ముందు ముందు తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# ధర్మ సంస్థాపనం - కైంకర్య వ్యవస్థ

ధర్మ సంస్థాపనం అంటే అందరూ ధర్మ బద్ధంగా జీవనము సాగించడము. అది అంత సులభముగా రాదు! అనాలోచితంగా మనము చేసే పనుల్లో మార్పు రావాలి. దాని గురించే ఆండాళ్ తిరుప్పావైలోని రెండవ పాశురములోనే మన నడవడికను సరిదిద్దుకొనే రీతిలో పాడింది. "శెయ్యాదన శైయ్యోం తీ క్కురళై శెన్రు ఓదోం" ఇవి రెండు అతి ముఖ్యమైనవి. పాటించడానికి కష్టమైనవి. అనుకొంటే కష్టమే ధృఢ సంకల్పము తీసుకొంటే పెద్ద కష్టమైన విషయమేమీ కాదు. మనకు పునరపి జననం, పునరపి మరణం అనే భయం వచ్చినప్పుడు ఆత్మోపజీవనానికి ఆలోచన వస్తుంది. శరీరము వేరని తెలియగానే దాని మీద శ్రద్ధ తగ్గుతుంది. అలాగే సకలము పరమాత్మ కైంకర్యార్థమే వినియోగించాలి.

ఇంకా అన్నీ మనకే మనది అన్న స్వార్థము వీడాలి. విధాయకముగా చేయవలసిన దానాలే కాదు ఎవరైనా వచ్చి అడిగితే మనకున్నదాంట్లో మంచిది వారికివ్వాలి. అడగకపోయినా వారి అవసరములను గమనించి దయతో వారికివ్వగలగాలి. అలా నాది నాకు అనే మమకారము వదులుతుంది.

వేదముకూడా ముందు క్రియావిధానముచెప్పి తరువాతేకదా తత్వబోధచేస్తుంది. అన్నీ పరమాత్మ కైంకర్యముగా అంటే ఎలా? ఏమి చేయాల్సి వుంటుంది. కాని అది కూడా శాస్త్రాన్ని మించి వుండకూడదు. మన రామానుజులు ధర్మమును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పాలుపంచుకొనేలా ఒక కైంకర్యవిధానాన్ని ఏర్పాటు చేసారు. "పత్రం పుష్పం ఫలం తోయం" ఏదిచ్చినా దాని వెనకాల వుండే భక్తినే చూసి నేను స్వీకరిస్తాను" అన్నారు భ.గీ. లో మన (బల) రామానుజన్. మన రామానుజులు అది ఎలా సమర్పించాలో నేర్పారు. భ. గీ. ను సంపూర్ణముగా విన్న అర్జునుడే క్రియా విధానము తెలియక దానిని పాటించలేక పోయాడు, రామానుజులు విధించిన ఈ "శీర్ తిరుత్తల్" (చక్కదిద్దడము) అనే "పణి విడై" కైంకర్యములో అందరూ ఆనందంగా పాలు పంచుకొంటూ నేటికీ ప్రతి వృత్తిలోని వారూ వారి వారికి తగిన కైంకర్యములను అందజేయ గలుగుతున్నారు. అది ఎలా చూద్దామా? "పత్తుకొత్తాళర్గళ్" అంటూ అందరూ కైంకర్యములను ఎలా సమర్పించుకోవాలో చెప్పారు, రామానుజులు.



ఒక కోవెల అంటే వైదిక మతానికి చెందిన వారు సమర్పించే ఆరాధనాది షోఢ శోపచార కార్యములే కాదు, తళిహ ప్రసాద తయారీ సమర్పణమే కాదు ఇంకా ఎన్నో వుంటాయి. అవి ఏమిటి?

పరమాత్మ మనకోసము తనను

### శ్రీమతి వంగల రాధిక

తాను ఎంత తక్కువచేసుకొని అర్చ్యారూపములో దిగి వచ్చారు! కోవెలలలో వెలిసారు! ఆయనకు మనము మన కృతజ్ఞతను చూపు కొనేందుకు ఎన్నెన్ని కైంకర్యాలు సమర్పించాలి? శ్రీరంగమే తీసుకొందాము. పెద్ద కోవెల. (సాక్షాత్తు పరమాత్మే బ్రహ్మకు ఆరాధనకోసము ఇచ్చిన తన తిరుమేని గొప్ప వైభవం గల స్వామి) మనము సేవించుకోడానికి వెళ్ళాము! ఏదైనా కైంకర్యభాగ్యము లభిస్తే బాగుండనని పరితపిస్తాము! అక్కడ అన్ని కైంకర్యములకూ ఎంతో ముందుచూపుతో రామానుజులు ఒక పద్ధతిని ఏర్పాటు చేశారు. దానినే "ముదల్ కొత్తు తిరుప్పదియార్" అని అంటారు. అది అక్కడ వుండే అర్చక పరిచారక స్వాములు. తరువాత "తిరుప్పణియార్" తరువాత "భాగవత నమ్బిమార్" "పారమేశ్వర సంహిత" పాంచ రాత్ర ఆగామానుసారముగానే అక్కడ కైంకర్యాలు సాయించ బడతాయి. అర్చక స్వాములని "భట్టర్లని" అంటారు. ఒక గోత్రము వారికి ఇబ్బంది దినములు ఏర్పడినా, మరొకరు అందుబాటులో వుండే విధముగా ఐదు గోత్రములకు చెందిన వారిని భాగవత నమ్బిమార్ అని ఏర్పాటు చేశారు.

"ఉళ్ళూరార్" అని వీరు అర్చకులకు సకల విధ సహాయములందించే వారు. వీరినే "ఎదుత్తు కై నీట్టిగళ్" అని కూడా అంటారు. ఉదాహరణకు అర్చక స్వాములు స్వామికి ధూప దీపాదుల కైంకర్య సమర్పణము చేస్తున్నారు. అప్పుడు సరిగ్గా ఆసమయానికి ఆ దీపానికి కావలసినంత నేయి సమర్పించి ఏ ఏ కైంకర్యాలకు ఎన్ని ముఖాలు వెలిగించాలో

దానికి తగిన వత్తులు సమర్పించి, కొడిగట్టకుండా దానిని తట్టి సరిచేసి పెట్టి సమయానికి అందిస్తేనే కదా భట్టర్ స్వామి ఆ కైంకర్య సమయానికి సమర్పించగలరు. అలాగే ధూపము ఎంత సాంబ్రాణి వేయాలి, నిప్పు నివురుగప్పి వుండకూడదు. అలా గని మంటా రాకూడదు. దానిని సరిపడ వూదీ వూదీ సరియైన సమయానికి సరిపడా ధూపము వచ్చేట్టు అందివ్వాలి. అందుకు సహకరించే కైంకర్యానికి కూడా ఏర్పాటు చేశారు.

మనకు ఈ కైంకర్యాల ఆవశ్యకత తెలియాలంటే మనము తరచూ సేవించుకొనే తిరుమలనే తీసుకొందాము. అక్కడ "విళక్కు తట్టువదు" అనేది చాలా ముఖ్య కైంకర్యము. అంటే ఏమిటి? దీపమును ఎప్పటికప్పుడు సరిచూసి సరిగ్గా వెలిగేట్లు వుంచడము. తిరుమలలో వేంకటేశ్వర స్వామికి పైనుంచి వేళ్ళాడే రెండు "నిలవిళక్కు" క్రింద ఎత్తుగా వుండే కుత్తివిళక్కు దీపపుశెమ్మె. దీనిని "నెలవిళక్కు" అని అంటారు. కరెంటు దీపాలు వుండవు. ఈ దీపాలన్నీ సరిగ్గా వెలుగుతూ వుంటేనే మనకు తిరువేంగడముడైయాన్ దర్శనము సరిగ్గా జరుగుతుంది. ముద్దలా పెద్ద వత్తి వుంటుంది. అది వెలిగే కొద్దీ లోపల మెల్ల మెల్లగా పొగ చూరుకు పోతుంది. పొగపోయే దారి లేదు. అందుకని ఏకాంగి స్వామి ప్రతి రెండుగంటలకు లోపలికెళ్ళి దానిని ఒక సారి చిన్నగా కొట్టాలి (తట్టరదు అని అంటారు) అందులో కష్టమేముంది అని అనుకుంటామా! పైన "కూరాళం" అనే పైవస్త్రము (ఛాందినీలా) వుంటుంది. గట్టిగా దెబ్బవేసాడో నిప్పుకణికలు దానిమీద ఎగిరిపడి అది అంటుకొంటుంది. ప్రక్కలో అన్ని విగ్రహ తిరుమూర్తులు వారికి తగిన వస్త్ర కైంకర్యములో అలరారుతుంటారు. ఏ ఒక్కరవ్వ వారిని తాకకూడదు. అంత జాగ్రత్తవహించాలి. రెండు గంటలకు వారు రాలేదు, కొంచెము సమయము విలంబనమయ్యిందనుకోండి లోపల పొగ కమ్మి మనలను లఘుదర్శనము, మహా లఘుదర్శనము అని వదిలినప్పుడు పెరుమాళ్ళు మసక మసకగా దర్శనమిస్తారు. మనము ఇంత దూరము ఆలోచించము. ఇలా అన్నిదివ్యదేశాలు తిరిగి అక్కడక్కడ వ్యవస్థలను బట్టి కైంకర్యములు ఏర్పాటు చేసారు దీర్ఘదర్శియైన రామానుజులు.

పూర్వకాలములో పది మంది చేసే ఇలాంటి చిన్న చిన్న కైంకర్యాలకు నేడు ఇద్దరు ముగ్గురే వుంటున్నారు. వారికి పని అధికము. సమయానికి అందిపుచ్చుకొన్నట్లు చేయడమూ కష్టమే!

రామానుజులవారు మనకందరికీ శేషత్వము సిద్ధించాలనే అతి సుకుమారులైన మనస్వామికి సక్రమముగా సమయానికి తగినట్లు కైంకర్యములు అందివచ్చేట్లు ఈ "కొత్తు పరివారమనే" కైంకర్యపరుల వ్యవస్థను స్థాపించారు.

"ఉళ్ళూరార్ విన్నప్పం శైవార్" అని పిలవబడేవారు. అరైయర్ స్వాములు అని అంటాము. ఆళ్వారుల నాలాయిర దివ్య ప్రబంధాన్ని తాళం తట్టి అభినయముతో పరమాత్మ ముందు ప్రదర్శిస్తారు. నాథమునులు పరమ పదములో వలె పరమాత్మకు దేవగాన ప్రక్రియలో ఈ కైంకర్యము జరగాలని ఏర్పాటు చేసిన కైంకర్యమిది. ఇది మనము 4 దివ్య దేశాల్లో సేవించవచ్చు. 1.శ్రీరంగము, 2. శ్రీవిల్లిపుత్తూర్, 3. తిరునారాయణ పురము, 4 ఆళ్వార్ తిరునగరి. పూర్వము "తిరు కణ్ణ పురత్తరైయర్" అని అక్కడ వుండేదన్నమాట! తిరుమాలిరుంజోలైలో ఒక జీయర్ స్వామి ఈ కైంకర్యము సాయించినట్లు తెలుస్తోంది. వీరు "విణ్ణప్పంచెయ్ వార్, తిరుక్కరగ కైయార్" అని పరమాత్మకు తిరుమంజనానికి, తిరువారాధనకూ తీర్థపుబిందెలను తిరుమంజన కావేరీ నుంచీ రంగనికి తీర్థం తెచ్చేవారు. పూర్వము ఐప్పశి మాసములో అమ్మా మండపము నుంచి బంగారు బిందెల్లో తిరుకరగ కైయార్ అను వారు తీర్థం తెస్తారు. (కరగం అంటే కుండ, బిందె)

"స్థానత్తార్గళ్" కోవెల కైంకర్యములు సరిగ్గా నడిచేట్లు అజమాయిషీ చేసేవారు. రాజుల ప్రతినిధులు వసూల్లు సమంగా వున్నాయా, కోవెల కార్యాలు సరిగ్గా నడుస్తున్నాయా? ఖర్చులు హెచ్చుతగ్గులు లేకుండా పెడుతున్నారా, ఎక్కడా ఎటువంటి అధర్మాలు నడవడము లేదుకదా, అని సరిచూసే ప్రతినిధులు.

"పట్టాళ్ కొత్తు" వీరు వేదము ఇతిహాసము పురాణాలు మొదలగునవి విన్నపము చేసేవారు. పెరియనమ్బి వంశస్థులు, భట్టర్ వంశస్థులూ నేటికీ వేద విన్నపము చేస్తారు. ఇలా అరుళప్పాడులు చేసేవారు నాయిందే నాయిందే అని స్వామి ముందు సాష్టాంగము సమర్పించి విన్నపము చేస్తారు పట్టాళ్ వంశస్థులు.

"వాశల్ కాక్కుం ముదలిగళ్" అంటే ద్వార పాలకులు, క్షేత్ర పాలకులు. విగ్రహ రూపములో వున్న జయ విజయులు కాకుండా దండము పట్టుకొని నిలబడి లోపలికి వెళ్ళేవాళ్ళను, వచ్చేవాళ్ళను నియంత్రించే వాళ్ళు. "ఆర్యభట్టాళ్ కొత్తు" గౌడదేశపురాజు రంగని (మిగతా 26 వ పేజీలో)



# శ్రీరామాయణంలో ఉపకథలు

# గంగావతరణ

**శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం**



శివుడు భగీరథుని తపస్సుకు మెచ్చి ఆయన కోరిక నెరవేరుస్తానని వరం ఇచ్చాడు. ఉగ్రంగా దిగిన గంగను శివుడు జటాజూటంలో పట్టి ముడి వేశాడు. అప్పుడు భగీరథుడు మళ్ళీ శివుడి కోసం తపస్సు చేయగా శివుడు గంగను వదిలిపెట్టాడు. హ్లాదిని, పావని, నళిని అని మూడు పాయలు తూర్పు దిశగా ప్రవహించాయి. సుచక్షువు, సీత, సింధువు అను మూడు మహానదులు పశ్చిమ దిశగా ప్రవహించాయి. ఏడవ పాయ భగీరథుణ్ణి అనుసరించింది. గంగావతరణ చూడటానికి ఎక్కడెక్కడి నుంచో దేవతలు, రాజులు, మాన్యులు, సామాన్యులు అక్కడికి వచ్చారు. ఆకాశం నుంచి పరమశివుడు శిరస్సు మీదికి అక్కడి నుండి భూమి మీదకు మహా ధ్వనితో, ఉధృతంగా గంగ ప్రవహించటం చూసి తన్మయులయ్యారు. బ్రహ్మ చేత శ్రీమన్నారాయణుడి శ్రీపాదాలు కడుగబడిన గంగ, పరమశివుడు శిరస్సున ధరించిన గంగ, స్వయంగా తానే పరమ పవిత్రమైన గంగ. భువిలో ఉండేవారే కాక దివిలో ఉండేవారు కూడా ఆ పవిత్ర జలాలలో స్నానం చేసి పునీతులై వాళ్ల వాళ్ల స్వస్థలాలకు చేరారు. ఆ సమయంలో జహ్ను మహర్షి గొప్ప క్రతువును నిర్వహిస్తున్నాడు. గంగ వేగంగా వచ్చి ఆయన ఆశ్రమాన్ని ముంచివేసింది. దీంతో ఆయనకు కోపం వచ్చి గంగా జలం మొత్తం మింగేసాడు. భగీరథుడు మళ్ళీ మహర్షి కృప కోసం తపస్సు చేశాడు. జహ్ను మహర్షి తాను పానంచేసిన నీటిని చెవి నుంచి బయటకు వదిలాడు. జహ్ను మహర్షి చెవి నుంచి బయటకు వచ్చింది కాబట్టి జాహ్నవి అని ఇంకొక పేరు వచ్చింది. అక్కడ నుంచి గంగను పాతాళంలో కపిల మహర్షి ఆశ్రమానికి తీసుకువెళ్లాడు. భగీరథుడి వెనకాల పాతాళానికి వెళ్ళిన పరమపావని అయిన గంగ కపిలుని ఆశ్రమంలో సగరుడి కొడుకులు 60 వేల మంది భస్మ రాశుల మీద ప్రవహించి వాళ్ళను పునీతం చేసింది. మూడు లోకాలను పావనం చేయడం వల్ల గంగకు త్రిపదగా అని ఆ పేరు వచ్చింది. శ్రీమన్నారాయణుడు త్రివిక్రమ అవతారం చేసి భూలోకాన్ని, ఊర్ధ్వలోకాలు, అధోలోకాలు కొలిచాడు. బ్రహ్మ ఊర్ధ్వలోకాలు కొలవడానికి పైకి వచ్చిన తన తండ్రిగారి శ్రీ పాదాలు పవిత్రమైన గంగాజలం తెచ్చి కడిగాడు. గంగ స్వతహాగా పవిత్రమైన జలం దానికి తోడు త్రివిక్రముడి శ్రీపాదాలు కడగడానికి బ్రహ్మ ఉపయోగించడం వలన పరమ పవిత్రం అయింది. పరమశివుడు శిరస్సున ధరించడం వలన ఆమె ఔన్నత్యం పెరిగింది. లోకంలో ఎన్నో నదులు ఉండగా గంగను మాత్రమే పరమ పవిత్రంగా ముల్లోకాల్లో గౌరవించడం జగద్విదితం. గంగకే ఉన్న ప్రత్యేకత గంగావతరణ కథను విన్నవారికి ధన ధాన్యాలు, అపారమైన యశస్సు లభిస్తాయి. దీర్ఘాయువు కలిగి, పుత్రపౌత్రులను పొందుతారు. వంశ వృద్ధి జరుగుతుంది. వాళ్ల పితృ దేవతలు ప్రసన్నం అవుతారు అని ఫల శృతి చెప్పబడింది. ఆ తర్వాత భగీరథుడికి సంతానం కలిగి ఆ వంశం వృద్ధి జరిగింది. ఇదంతా చరిత్ర.

ఈ చరిత్ర నుంచి మనం నేర్చుకోవలసింది

1. ఆ కాలంలో రాజులు ప్రజా శ్రేయస్సు కోసం మాత్రమే పరిపాలన చేశారు. చట్టం ముందు అందరూ సమానమే అనే విషయాన్ని ఆచరించారు. అది కేవలం చెప్పడానికి మాత్రమే పరిమితం కాలేదు. ఈ విషయం అసమంజసుని కథలో చూస్తాం.

2. సగరుడి 60000 మంది కొడుకులు భుజబలం మాత్రమే ఉన్నవాళ్ళు , బుద్ధి హీనులు, బలగర్వం గలవాళ్ళు. అందుకే వాళ్ళు కార్యసాధకులు కాలేదు. 60000 మంది వెళ్ళి ఒక్క యజ్ఞాశ్వాన్ని తీసుకురాలేక పోయారు. పైగా అందరు నీచంగా చనిపోయారు. ఉత్తర గతులు కూడా దొరకలేదు. వందల సంవత్సరాలు భస్మ రాశిగా పడి ఉన్నారు. అంశుమంతుడు భుజబలం, బుద్ధి బలం కూడా

# గంగావతరణ

గలవాడు. వినయవిధేయతలతో సమయోచితంగా ప్రవర్తించి తన పినతండ్రి జాడ, యజ్ఞాశ్వం జాడ తెలుసుకున్నాడు. అంతే కాక వాళ్ళు ఉత్తమ గతులు పొందే మార్గం తెలుసుకొని అశ్వాన్ని తీసుకువచ్చి యజ్ఞం పూర్తిచేసాడు. కాబట్టి కేవలం భుజబలం చూసుకొని గర్వించకూడదు బుద్ధి బలం, వినయవిధేయతలు ఉంటేనే విజయం సాధించగలరని గ్రహించాలి.

3. పితృ వర్గానికి చేయవలసిన పితృ కార్యం తప్పక చేసి తీరాలి. ఏ కారణం చేతనైనా ఆగిపోతే రెండుతరాలదాకా కాపాడుతుంది, ప్రభావం చూపదు. ఆ తరువాత వంశవృద్ధి జరగదు అని శాస్త్రం చెబుతుంది. ఈ కథలో సగరుడి పుత్రులకు పితృకార్యం జరగలేదు. అయినా అంశుమతుడికి దిలీపుడు, ఆయనకు భగీరథుడు పుట్టారు. తరువాత భగీరథుడికి సంతానం కలగలేదు. ఆయన తపస్సు చేసి బ్రహ్మ అనుగ్రహం పొంది పితృకార్యం నెరవేర్చిన తరువాత మాత్రమే సంతానం పొందగలిగాడు. అందువలన పితృకార్యం తప్పక చేయవలసిన విధి అని గ్రహించాలి. ఒక కుటుంబంలో సంతానం కలగలేదంటే ముందు పితృ వర్గానికి చేయవలసిన క్రియలను పూర్తి చేయాలి.

దీనికి కారణం ఏమిటి? ఒరుగుతో చేరి దారం ఎండినట్లు! అని తెలుగులో ఒక సామెత ఉంది. కొన్ని ప్రాంతాలలో దారం మీద ఒరుగులు పెడతారు. ఆ ఒరుగులతో పాటు దారం కూడా ఎండుతుంది. అదే దారంతో పూలమాల కడతారు అప్పుడు ఆ మాలను భగవంతుడి మెడలో అలంకరిస్తారు. స్త్రీలు తల మీద పెట్టుకుంటారు. పూలతో చేరిన దారం కూడా భగవంతుడి మెడను అలంకరిస్తుంది, స్త్రీలకు శిరోధార్యం అవుతుంది. అంటే వస్తువుకు స్వతహాగా గొప్పతనం ఉన్నా అది ఎవరి సంపర్కం పొందిందో, దాని వలన స్వతహాగా ఉన్న గొప్పతనం పెరగడమో, తరగడమో జరుగుతుంది. కాబట్టి మంచివారితో స్నేహం చేయాలి. మన అభివృద్ధికి దోహదం చేసే వారితో చేరాలి. మనల్ని కిందికి దిగజార్చేవాళ్ళతో చేరకూడదు అని తెలుసుకోవాలి. మన పెద్దలు ఇతిహాసపురాణాలలో ప్రతి కథలోనూ ఎన్నెన్నో అద్భుత విషయాలు చెప్పారు. వాటిని చదివి, పెద్దల ద్వారా విని అర్థం చేసుకొని మన జీవన మార్గాన్ని పరిపుష్టి చేసుకునే ప్రయత్నం చేద్దాం. ★

(24 వ పేజీ తరువాయి) కైంకర్యానికి బోలెడు ధన ధాన్యాదులు, వజ్ర వైఢూర్యమాణిక్యాది ఆభరణాలు పంపారు. ఎందుకో అప్పటికి భగవాన్ అది అనుగ్రహించలేదు. అందుకని కొంతమంది ఆర్యులను ఆ సంపద రంగడు స్వీకరించేవరకూ ఎటూ తస్కరింప బడకుండా కాపలా కాసేందుకు నియమించారు గౌడ దేశమునుంచి వచ్చిన ఆర్యులు. "ఆర్యపట్టాల్ వాశల్" ఇది గరుడ మండపము దాటిన తరువాత వచ్చే ద్వారము. చాలామంది రక్షకభటులు అక్కడ కాపలాకు నియమించ బడి ఉంటారు. చివరది "దాసనంబి" వీరు పుష్పకైంకర్య పరులు. ఈనాటికీ ఈ పరివారము పలువిధాల కైంకర్యాలు సమర్పిస్తున్నారు. ఇలా పది విధముల "పత్తుకొత్తు" కైంకర్యపరులు రామానుజుల వారిచే నియమించబడ్డారు. వీరు శాత్తిన శ్రీవైష్ణవుల పరివారము. వీరూ వైష్ణవులు. బ్రాహ్మణ వంశానికి చేరని వారు. వారికీ రకరకాల కైంకర్యములు వున్నాయి. వారినే శాత్తాద వైష్ణవులని, నేడు చాత్తాద వైష్ణవులంటారు. వీరికీ కైంకర్య విధులు ఏర్పాటు చేశారు. రామానుజులవారు కైంకర్యపరులైన అందరికీ పద్ధతిగా ఎవ్వరూ ఎదురు చెప్పడానికి వీలు లేని రీతిలో ఎంతో చక్కని ధర్మ వ్యవస్థను ఏర్పాటుచేశారు. వర్ణాశ్రమ ధర్మాలను మీరకుండా వారి వారికి తగిన హక్కులను పదిల పరుస్తూ వ్యవస్థను ఏర్పరిచినారు. ★

## శ్రీసన్నిధి పదకేళి (2)
## సమాధానాలు

విజేతలకు మే నెల పత్రిక పంపించడం జరుగుతుంది

నిలువు

1. శ్రీరాముడు 2. మండోదరి 3. ఏకలవ్యుడు
4. సరస్వతి 5. శ్రీరామనవమి

అడ్డం

5. శ్రీనివాసుడు 6. క్రోధి. 7. చైత్రం
8. ధ్వని,శబ్దం 9. స్నుష 11. బాలవిజ్ఞానం
12. విరాటరాజు 13. అంబ

సరియైన సమాధానాలు పంపినవారు:

వనమాల రామలింగాచారి, యాదగిరి గుట్ట
వై.శివప్రసాద్, బోయవాడ, కరీంనగర్
జి. సువర్ణ, సిరిసిల్ల,

# అవయవ విభూతి

## ఆచార్యాభిమానము పరార్థ కైంకర్యము

ఆచార్యాభిమానమే ఉత్తారకం అని తదేకమైన నిష్ఠ కలిగిన వడగనంబి యొక్క చరమ పర్వనిష్ఠను మాకు అనుగ్రహించవలసినది అని స్తుతించ బడింది. ఇంతకీ ఎవరు ఈ వడగనంబిగారు. అంటే రామానుజుల వారికి ఆంతరంగికమైన కైంకర్యం చేసుకునే వారట! భగవత్ శేషత్వం కన్నా ఆచార్య కైంకర్యమే చరమోపాయంగా భావిస్తూ అదే నిష్ఠలో ఉండే వారట! ప్రతిరోజు తాము తిరుమణి కాప్పు ధరించగా మిగిలిన శేషం ఈ వడగనంబి గారి నుదుటను ఉంచేవారట! ఆచార్య అభిమానాన్ని సంపూర్ణంగా లభింపచేసుకున్న మహానుభావులు.

వీరు రామానుజుల వారి కాషాయం(వస్త్రం)లో వేంచేసి ఉంటారట! భగవద్రామానుజుల దివ్యదేహ సౌందర్యానికి ధీటుగా అత్యంతంగా ప్రకాశిస్తూ కుంకుమపువ్వు వర్ణంలో తగిన విధముగా దాల్చబడి ప్రకాశిస్తుందట ఆకాషాయము. పరివేష్టించి ఉన్నట్టుగా ఉండే ఆ కాషాయమునకు మంగళం అంటున్నారు. “తిరువరయిర్ శాత్తియ శెందు వరావై వాళి” అందువలన రామానుజుల వారి కాషాయవస్త్రాన్ని స్మరిస్తే మనకు ఆచార్య అభిమానం సంపూర్ణంగా లభిస్తుందట.

“మాలాంచ కురుకేశార్యం” రామానుజుల వారు ధరించే మాలలో తిరుక్కురుగై ప్పిరాన్ అనే ఆచార్యులు వేంచేసి ఉంటారట! రామానుజుల వారి ఆజ్ఞ మేరకు తిరువాయి మొళికి ఆరాయిరప్పడి అన్న వ్యాఖ్యానాన్ని అనుగ్రహించారు. రామానుజుల వారు వీరిని అభిమాన పుత్రులుగా స్వీకరించారట. అందువలన వారి తిరుమాలను సేవిస్తే మనం కూడా అభిమాన బిడ్డలవుతాం. బిడ్డలైతే ఇంకేముంది మోక్షం లభించినట్టే మరి. తండ్రి సంపద పిల్లలకే కదా లభిస్తుంది. తరగని సంపద ఎందువలన అంటే మరి రామానుజుల వారు “విష్ణులోక మణిమంటప మార్గదాయి” కదా!

“ఛాయామ్ శ్రీ చాపకింకరం” రామానుజుల వారి ఛాయ అంటే నీడ అండన పిళ్లై ఉరంగా పిల్లి దాసన్ అని ధనుర్దాసు అనే ఆచార్యులు వేంచేసి ఉంటారుట! ధనుర్దాసులో ఉన్న సౌందర్య వ్యామోహాన్ని భగవత్ సౌందర్యానుభవంగా మార్చినవారు భగవద్రామానుజుల వారు. వీరు తక్కువ కులము అని ఆనాటి సమాజంలో అందరూ అభిప్రాయ పడ్డా వీరి ప్రవర్తన అనే సత్ స్వభావాన్ని మాత్రమే గ్రహించిన వారు భగవద్రామానుజులు. వీరిని సేవిస్తే ఫలం ఏమిటి? అంటే



**శ్రీమతి కొడకళ్ళ పద్మజ జ్యోతిర్మయి, చెన్నై.**

పరార్థ కైంకర్యాన్ని అంటే తనకోసం అని కాకుండా కేవలం భగవత్ భాగవత ఆచార్య ముఖ వికాసం కోసమే కైంకర్యం చేసుకుంటాము. వీరు 25వ ఆచార్యులు. అచిత్ తత్వాలు 24. జీవాత్మ తత్వం 25, భగవత్ తత్వం 26. ఈ అవయవ విభూతి స్తోత్రంలో

“రామానుజాచార్యస్య అవయవాన్ అఖిలాన్ గురూన్
మహాంతం చావయవినం రామానుజ మునిం భజే” అని చెప్పబడినది. భగవంతుని ముఖ వికాసం ఎప్పుడు కలుగుతుందంటే ఆచార్యులను సేవించిన నాడు. శ్రీరామానుజుల వారి అవయవాలలో వేంచేసి ఉన్న పూర్వాచార్యులను అందరికీ అన్నింటికీ అంగిగా ఉన్న మహాత్ములైన జగదాచార్యులైన భగవద్రామానుజుల వారిని సేవించినట్లే అంటున్నారు ఈ శ్లోకంలో.

గురు మూర్త్యాత్మ యోగీంద్రం యోధ్యాయేత్ ప్రత్యహం నరః
సర్వాన్ కామాన్ అవాప్నోతి, లభేచ్చాంతే పరంపదమ్

ఇలా నిత్యం అనుభవించిన వారు భగవద్భాగవత ఆచార్య రూపమైన కైంకర్యాలు అనుభవించి అంత్యకాలమున పరమపదాన్ని పొందుతారు అని ఫలశృతిని చెప్పబడింది .

రామానుజో విజయతే యతిరాజరాజహ కాంతిమత్యా ప్రసూతాయ యతిరాజాయ మంగళం. (సమాప్తం) ★

# శ్రీనృసింహం భజామ్యహం

## శ్రీమాన్ శ్రీ చిలుకమర్రి శ్రీనివాసాచార్యులు



శ్రీకాంతాహృదయాభూషం
క్షీరార్ణవ నివాసినం
భక్తాభీష్ట ప్రదాతారం
శ్రీనారసింహమాశ్రయే

విచిత్ర వరాప్త గర్వఘ్నం
విచిత్రరూప ధారిణం
భక్తవాక్పరిపాలకం
శ్రీనృసింహం భజామ్యహం

ప్రహ్లాద హ్లాద సంశోభితం
దైతేయ మనోవిదారం
విశ్వంతరాళ సుస్థితం
శ్రీనృసింహం భజామ్యహం

స్తంభోద్భవం మహావీరం
దానవాడంబరాంతకం
భక్తలోక పరాధీనం
శ్రీనృసింహం భజామ్యహం

ధర్మసంస్థాపనోద్యుక్తం
సకల సుర సేవితం
జగన్నాథం మహావిష్ణుం
శ్రీ నృసింహా భజామ్యహం

# పుస్తక పరిచయం

శ్రీమాన్ శ్రీ గోపాల దేశికర్ రచనలు

సంప్రదాయ జ్ఞాన సంపన్నులు ఉదారులై ఎన్నో రచనలు చేసిన కీర్తి మూర్తులు శ్రీమాన్ శ్రీ తే.కం.గోపాలాచార్య స్వామివారు. వారి రచనలు శ్రీవైష్ణవ సంప్రదాయ సమగ్ర పరిశీలనకు ఉపకరించే నిఘంటువుల వంటివి. దాదాపుగా పూర్వాచార్య కృత గ్రంథ ప్రబంధాలన్నింటికీ సంక్షిప్త సమగ్ర వ్యాఖ్యలు వారు రచించారు.వారి రచనలు ఇటీవల పునర్ముద్రణ గావింపబడి ఆసక్తిపరులకు అందు బాటులోకి వచ్చాయి. జట్ ముద్రణలో రామానుజవాణి ద్వారా ఈ గ్రంథాలు లభ్యమవుతున్నాయి. వారి రచనలో శైలి నాటి కాలానుగుణంగా గ్రాంథికమైనదైనా ఋషి వాక్కు వలె వారి హృదయం ప్రతిఫలించే సమగ్ర వివరణలతో రచనలు సంప్రదాయ రహస్యాలను స్పష్టంగా విశదీకరిస్తాయి. 20 పేజీలు కలిగిన విడివిడి అంశాలుగా ముక్తకాలుగా వచ్చిన చిన్న పుస్తకాలు ఆణిముత్యాలు! అమ్మ శపథం, అష్టాదశ రహస్యములు, (విడివిడిగా) యతిరాజ వింశతి, భజయతిరాజ స్తోత్రం, విజ్ఞాన మంజూష (బాలశిక్ష ),పూర్ణ శంగోలం,సార సంగ్రహం, జితాంతా స్తోత్రం, సమాశ్రయణ విధి, నందగోపాలుడు, మంత్ర రత్నము, చరమ శ్లోకము, విష్ణు సహస్రనామ నిరుక్తం ఇత్యాది పుస్తకములు 20 నుండి 300 పైగా పేజీలు కలిగిన సంప్రదాయ గ్రంథములు అందుబాటులో ఉన్నాయి 25 రూపాయలు నుండి 150 ఆపై మూల్యము కలిగినవి. ఇవి కాకుండా మరింత అమూల్యమైన సాంప్రదాయ జ్ఞానాన్ని అందించే రచనలు పునర్ ముద్రించబడి అందుబాటులోకి రావాల్సి ఉన్నాయి. వాటిలో పరాంకుశ పరోపదేశములు, తత్వశేఖరం, ద్రవిడోపనిషత్ సంగతి, గీతా దర్శనమే రామానుజ దర్శనం, భగవద్గీత వైచిత్రి, కళ్యాణములు,గద్య త్రయం ఇలా మరికొన్ని పుస్తకాలు పునర్ముద్రణ కావలసి ఉన్నాయి. పై పుస్తకాలను జెట్ సంస్థలు, రామానుజవాణి ద్వారా ఆసక్తిపరులు పొందవచ్చును.



# మహానుభావుల చరితలో మధుర ఘట్టాలు

మహానుభావుల జీవితంలో ని సన్నివేశాలు కూడా మనకు గొప్ప ఉపదేశాలను అందిస్తాయి. ఆత్మోజ్జీవనానికి ప్రేరణ కలిగిస్తాయి.

తనలో గల దోషములను, తాను చేసిన అపచారములను భగవంతుని సన్నిధిలో దాచుకోకుండా విన్నవించుకొని క్షమింపమని ప్రార్థించుట మన పెద్దల ఆచారము. అది సహజము. నేను జ్ఞానవంతుడను ఆచారవంతుడను అని తన యోగ్యతను బట్టి భగవంతుడు రక్షిస్తాడు అన్న వ్యర్థ విశ్వాసము వీడి నైచ్యాను సంధాన పూర్వకముగా తన అకించనత్వం ప్రకటించుకొనవలెను.

శ్రీ పరాశర భట్టర్ వారు ఒకనాడు శ్రీ రంగనాధుని సన్నిధికి పోయి అక్కడ శ్రీ యామునాచార్యుల వారు ప్రసాదించిన స్తోత్ర రత్నములోని ఈ క్రింది శ్లోకము అనుసంధించు కొనుచున్నారు.

శ్లో॥ అమర్యాదః క్షుద్రః చలమతిః అసూయా ప్రసవభూః
కృతఘ్నః దుర్మానీ స్మరపరవశః వంచనపరః।
నృశంసః పాపిష్ఠః కదమహం ఇతో దుఃఖజలధేః
అపారాదుత్తీర్ణః తవ పరిచరేయం చరణయోః॥

పై శ్లోకంలో చెప్పబడిన దోషములు ఎన్నో కలిగిన పాపిష్ఠుడనగు నేను ఈ అపార దుఃఖ సముద్రం నుండి బయటపడి నీ పాదారవింద సన్నిధానం చేరి ఎలా సేవ చేయగలను? అని తమ నిర్వేదమును రంగనాథునికి విన్నవించుకొనుచుండిరి.

అప్పుడు వీరి వైభవమును ప్రతిష్టను సహింపలేని ఒక వైష్ణవుడు అక్కడికి వచ్చి ఈ భట్టరు పై శ్లోకంలో చెప్పినట్లు మర్యాదహీనుడు, నీచుడు, మతి చెలించినవాడు, అసూయపరుడు, కృతఘ్నుడు, దురహంకార శాలి, వ్యభిచారి, మోసగాడు, క్రూరుడు ఇంత ఎందుకు పంచ మహాపాతకములు చేసినవాడు ఇది సత్యము సత్యము సత్యము అని అదే పనిగా వీరిని వినరాని మాటలతో దూషించుచూ గోల చేయసాగెను. అతడు చేయు దుర్భాషలకు అందరూ ఆశ్చర్య చకితులై చూచుచుండిరి.

ఇదంతయు గమనించిన భట్టరువారు తమ ప్రార్థనను ముగించుకొని నిందించుచుండిన ఆ వైష్ణవుని వద్దకు వచ్చి తమ చేతిలో ఉన్న సుదర్శన ముద్రగల బంగారపు ఉంగరము తాము కప్పుకున్న కాశ్మీర్ శాలువను ఆయనకు సమర్పించి నమస్కరించిరి. వారు చేసిన ఆ సత్కారమునకు ఆ వైష్ణవుడు నిలువునా నీరైపోయెను. పక్కన ఉన్నవారికి ఆశ్చర్యమునకు అంతులేదు. ఆ వాగుబోతు వైష్ణవునికి భయపడి భట్టరు వారు అతనిని సన్మానించి



**శ్రీమాన్ శ్రీ నెల్లుట్ల దత్తాత్రేయ స్వామి**

నమస్కరించిరని కొందరు ఆక్షేపించడం ప్రారంభించిరి. వారందరినీ సముదాయించుచు బట్టర్ వారు ఇట్లు గంభీరంగా సమాధానమిచ్చిరి. "నేను! ఇతని తిట్లకు భయపడి సన్మానించుట లేదు.

నాకు తెలియని నాలో ఉన్న దోషములను భగవంతునికి వినపడునట్లు వివరించి చెప్పుట చేత నాకు ఉపకారము చేసినవాడయ్యెను. భగవత్ సన్నిధిలో నేను చేసుకొను నైచ్యానుసంధానమున నాకు సహాయము చేసెను. ఈ ఉపకార స్మృతి తోనే సన్మానించితిని. ఇతనికి ధనము పై అపేక్ష కలదు. కనక వేరే సన్మానము గాక అతనికి ఇష్టమైన బంగారమునే ఇచ్చితిని. గ్రామ సూకరమునకు దానికి ఇష్టమగు ఆహారము యుత్తుము గాని తోచిన దానిని పెట్టరు కదా! ఆ విధంగా నేను అతనికి ఇష్టమైన బంగారం ఇచ్చి నా ఉపకార స్మృతిని ప్రకటించుకొంటిని" అని అన్నారు.

నన్ను తిట్టెదవా అను రోషముతో తిరగబడి ఆ వైష్ణవుని దండింపక అతని దోషమును నిండు మనసుతో క్షమించి పైగా అతనికి దయతో సన్మానము కూడా చేయుట ఆశ్చర్యమే! ఊహింపరాని ఈ చర్యకు చెకితుడైన ఆ వైష్ణవుడు మానసిక పరివర్తనాన్ని పొంది సంస్కారవంతుడు అయ్యాడు.

శ్రీవచన భూషణమునకు తిరునారాయణపురత్తు అను ఆచార్యులు వ్రాసిన వ్యాఖ్యలో ఈ కథ ఉదహరింపబడినది. "శక్తానం భూషణం క్షమా" అన్నట్లు శిక్షింపగలిగి ఉండి కూడా అతని దోషమును క్షమించుట మన ఆచార్యులలోని మహా గుణము.

★

# ఆధ్యాత్మిక వార్తలు

## శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవము, నిజామాబాద్

నిజామాబాద్ బ్రహ్మపురి ఎంజీ ఫంక్షన్హాల్లో మార్చి 31న శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవ సన్నాహక సమావేశం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన చిలుకమ్రి శ్రీవర్ధనాచార్యులు, శిరిశినహల్ శ్రీనివాసచార్య, ఎంఎస్ ఆచార్య, కె.రమణాచార్య, మిట్టపల్లి శ్రీధరాచార్య, నరేశ్ శ్రీకుమార్, కందాలై వినోద్ కుమార్, సముద్రాల శ్రీధరాచార్య, మధుసూదనాచార్య, సముద్రాల రామాచార్య గోవర్ధన సందీప్ కుమార్ సన్మానిస్తున్న కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరువేంగళాచార్యులు, ప్రధాన కార్యదర్శి సేనాపతి మోహనాచార్యులు, రాష్ట్ర గౌరవా అధ్యక్షుడు కండ్లకుంట యాదగిరాచార్యులు, ప్రతినిధులు చిలుకమ్రి లక్ష్మీనాథ చార్యులు, బీఎస్ ఆచార్యులు, కె. నాగరాజాచార్యులు పాల్గొన్నారు.









## మధుర భారతీ బిరుదు ప్రదానం


మార్చి 30, 31 తేదీలలో బాసరలోని శ్రీ నృసింహ నిలయములో రెండు రోజుల శ్రీమద్రామాయణ ప్రవచనముల అనంతరం జ్ఞాన సరస్వతీ బ్రాహ్మణ పరిషత్తు వారు శ్రీమాన్ డా. వోలేటి రవికుమారాచార్య స్వామికి మధుర భారతీ అనే బిరుదు ప్రదానం చేశారు.



# వసంత నవరాత్రోత్సవములు

## నవాహ్నిక ఏకకుండాత్మక శ్రీరామాయణ హవనము

## శ్రీరామాయణ ప్రవచనములు













వసంత నవరాత్రులు సందర్భముగా కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణ మండపములో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారిచే శ్రీరామాయణ ప్రవచనములు మరియు నవాహ్నిక ఏకకుండాత్మక శ్రీరామాయణ హవనము 09-04-24 నుండి 17-04-24 ఉగాది నుండి శ్రీరామ నవమి వరకు జరిగినాయి. శ్రీరామపాదుకారాధన, శ్రీ సీతారామ కళ్యాణం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం ఈ కార్యక్రమంలో వైభవంగా నిర్వహించారు.












వసంత నవరాత్రోత్సవములు













# అభినవ భూతపురి
# భగవద్రామానుజాచార్యుల దివ్యక్షేత్రం





## ఇల్లందకుంట

వైకుంఠంలో భగవంతునికి నిత్య కైంకర్యాలు చేసే ఆదిశేషులు భగవద్రామానుజాచార్యులుగా అవతరించారని పెద్దలు చెబుతారు వేద మార్గ ప్రతిష్ఠాపనాచార్యులై ఉభయ వేదాంతాలను ప్రాచుర్యం చేస్తూ ఆసేతు హిమాచలం భగవత్ రామానుజాచార్యులు పర్యటించారు. ఆ క్రమంలో మన తెలుగు ప్రాంతాల్లో కూడా పర్యటించినట్లు కొన్ని ఆధారాలు కనిపిస్తున్నాయి. పూర్వం కాకతీయుల రాజ్యంలో అంతర్భాగమైన కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట గ్రామంలో వేల సంవత్సరాల అతి ప్రాచీనమైన సీతారామాలయం ప్రసిద్ధమై ఉన్నది. ఇల్లందకుంటలో మరొక గొప్ప మహత్తు కలిగిన భగవద్రామానుజాచార్యుల ప్రాచీన దేవాలయం ఉంది. జగదాచార్యుల సన్నిధి వైభవంతో ఈ క్షేత్రం ప్రసిద్ధమైనది. పూర్వం సీతారాముల బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న సమయంలో ఒక అర్చక స్వామికి స్వప్నంలో ప్రతిరోజు ఒక బంగారు వర్ణంలో గల పుట్ట మరియు పెద్ద సర్పము కనిపిస్తూ ఉండేవట! అలా ప్రతి దినము కనిపిస్తుంది కనుక ఉత్సవాలకు



పుట్ట మట్టి ఈ పుట్ట నుండే సేకరించమని భగవంతుని ఆజ్ఞ కావచ్చునని భావించారు. ఆ ప్రాంతంలో ఉన్న ఆ పుట్ట దగ్గరకు వెళ్లి పూజలు చేసి ప్రార్థించి పుట్టమన్ను తవ్వి తీసుకొనుటకు సిద్ధపడ్డారు. ఆ సమయంలో పుట్టలో కదలికలు కనిపించాయి. పాములు ఉన్నాయని తలచిన అర్చకులు పుట్ట నుండి కొంచెం దూరంగా జరిగి భగవంతుని ప్రార్థించసాగారు. అప్పుడు ఆ పుట్టలోంచి బంగారు వర్ణంలో ఉన్న ఒక దివ్య సర్పం బయటకి వెళ్ళిపోయింది. ఆ సర్పం కదలికలకు పుట్ట కూడా చెదిరిపోయింది కానీ ఆశ్చర్యంగా అందులోంచి ఒక శిలా రూపం బయటపడింది. పూర్తిగా మట్టిని తొలగించి చూశారు. అద్భుతమైన భగవద్రామానుజాచార్యుల వారి దివ్య మంగళ విగ్రహం సాక్షాత్కరించింది. అర్చకులు భక్తితో ఆనంద పరవశు లయ్యారు అదంతా ఆచార్యుల అనుగ్రహంగా పూర్వజన్మ సుకృతంగా భావించారు. వెంటనే సన్నిధిని తాత్కాలికంగా తడకలతో మట్టితో నిర్మించి సాంప్రదాయబద్ధంగా ఆరాధనలు కొన సాగించారు. ఆ ఆలయ నిర్మాణము కూడా జరిగింది. అప్పుడప్పుడు అరుదుగా భగవద్రామానుజాచార్యుల దేవాలయంలో

## అభినవ భూతపురి
## భగవద్రామానూజాచార్యుల దివ్యక్షేత్రం



గొప్ప పెద్ద ఘటసర్పం కనిపించేదనే వార్త ప్రాచుర్యంలో ఉంది. ఆ సర్పాన్ని పట్టుకుందామని ప్రయత్నించడం చేత నేటి కాలంలో అదృశ్య రూపంలో ఉండి కనిపించడం లేదు అని కూడా ప్రచారంలో ఉంది. స్వామికి ఆరాధనలు జరుపుతున్నప్పుడు ఇప్పటికీ సర్పం బుసలు కొడుతున్న శబ్దం వినిపిస్తూ ఉంటుందని అర్చక పెద్దలు చెప్తుంటారు. గొప్ప



మహత్తు కలిగిన అతి ప్రాచీనమైన స్వయం వ్యక్త సీతారామచంద్ర ఉత్సవ మూర్తులు ఈ దేవాలయంలోనే నిలిపి ఉంచుతారు. భగవద్రామానుజాచార్యులు రక్షణ నిమిత్తం సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తుల సన్నిధానమై వేంచేసి ఉంటారు అని స్థల పురాణము. సాంప్రదాయబద్ధంగా పాంచరాత్రాగమ రీతిలో ఆరాధనలు నిర్వహింపబడతాయి. చైత్ర శుద్ధ సప్తమి నుండి తదియ వరకు నావాహ్నికముగా మొత్తం 13 రోజులు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. భగవద్రామానుజ తిర్నక్షత్ర ఉత్సవములు వైభవంగా జరుపుతారు. పారంపర్యంగా. శేషమ్ రామాచార్యులు, ప్రధాన అర్చకులుగా, శేషమ్ వంశీధరచార్యులు అర్చకులుగా, శేషమ్ సీతా రామాచార్యులు యజ్ఞాచార్యులుగా ఆరాధనలను కొనసాగిస్తున్నారు. ★

# ఋషిపత్ని పరిపూర్ణ భక్తి

(20 వ పేజీ తరువాయి)) మమ్ము నీ దాసులుగా భావించి అనుగ్రహించు! అనగానే స్వామి కర్మానుబంధ మైన శరీరం విడిచిన తదుపరి నన్ను పొందగలరు అంటూ శ్రీకృష్ణుడు వారు తెచ్చిన ఆహారములు మిత్రులతో కలిసి భుజించాడు.

ఋషిపత్నులంతా తిరిగి అగ్రహారం వెళితే ఋషులు కోపగిస్తారని వారు భయపడ్డారు. కానీ కృష్ణుడు వారేమీ అనరని అభయమిచ్చాడు. అందరూ అగ్రహారానికి బయలుదేరి వెళ్లారు కానీ అందులో ఒక స్త్రీ మాత్రం అక్కడనుండి శ్రీకృష్ణుని విడిచి వెళ్లలేక అక్కడే ప్రాణం వదిలింది. అలా భగవంతుని వదల లేక నేనేమైనా ప్రాణాలు వదిలానా అంతటి భక్తి నాకు లేదు కదా అని పెణ్ పిళ్ళైగారు తన తక్కువ తనాన్ని తెలుపుతూ “దేహత్తై విట్టేనో ఋషిపత్ని యై పోలే” అంటూ నైచ్యానుసంధానం చేసింది. ★

# మానవ జీవితంలో శ్రీరాముడు

జగిత్యాల జిల్లా అభయాంజనేయ ఆలయములో నంబి వేణుగోపాలాచార్య కౌశిక గారిచే మానవుని జీవితంలో శ్రీరాముడు అనే అంశంపై మూడు రోజుల పాటు ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. వారు అనుగ్రహభాషణం చేస్తూ, సమకాలీన ప్రపంచంలో మానవీయ విలువలు తగ్గి పోతున్నాయని రామాయణాన్ని ఆదర్శంగా తీసుకుంటే మానవ జీవితం సుఖంగా కొనసాగుతుందని గుర్తు చేశారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.




# ఉపకారికి అపకారం

ఒక ఊళ్ళో రమణమ్మ లక్ష్మయ్య అనే దంపతులుండేవారు. వాళ్ళకు పిల్లలు లేరు. అందువల్ల ఆ భార్యాభర్తలిద్దరూ బాధపడి చివరికొక ముంగిసను తెచ్చి పెంచుకున్నారు. ఆ ముంగిస వాళ్ళకెంతో మచ్చికయి ఇంట్లో పసిపిల్లవానిలా తిరుగుతుండేది. కొంతకాలం అయ్యేసరికి వాళ్ళకో చిన్న పాపాయి పుట్టింది. వాళ్ళు వాళ్ళతో పాటు ఆ ముంగిస కూడా ఎంతో ఆనందపడ్డారు.

లేక లేక పుట్టిన ఆ పాపాయిని వాళ్ళు ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. ముంగిస కూడా ఆ పాపతో ఆడుకుంటూ ఉండేది.

ఒకరోజున రమణమ్మ నీళ్ళ కోసం బయటకు వెళ్ళింది. వెళ్తూ ముంగీసను పిలచి పాపకు కాపలాగా ఉండుమని చెప్పి నీళ్లకు బయలుదేరింది. పాప అప్పుడు ఉయ్యాల్లో హాయిగా నిద్రపోతున్నది. ముంగిస ఆ ఉయ్యాల చుట్టూ తిరుగుతూ గంతులేస్తూ పాపనే చూస్తూ, పాప యెప్పుడు లేస్తుందా. ఎప్పుడాడుకుందామా అని ఆలోచిస్తూ కాపలా కాస్తున్నది. కొంతసేపటికి ఒక పాము ఇంటిదూలం నుండి ఉయ్యాల గొలుసు మీదకు ప్రాకి గొలుసు గుండా ఉయ్యాలలోకి వస్తుండటం ముంగిస చూసింది. పాము పరమ దుర్మార్గురాలని, విషజంతువని ముంగిసకు తెలుసు. అందువల్ల పాపకు ఏమయినా అపకారం చేస్తుందేమో నని హడలిపోయింది. ఆలోచిస్తూ కూర్చుంటే లాభం లేదని వెంటనే ఉయ్యాలలోనికి గెంతి ముంగిస గొలుసులనుండి వస్తున్న పామును ఎదుర్కొంది. హోరా హోరీగా దానితో పోరాడసాగింది. ఎలాగ అయితేనేం దాన్ని ముక్కలు ముక్కలు కొరికి చంపేసింది. పాపకు ప్రమాదం తప్పింది. సుఖంగా నిద్రిస్తున్న పాపను చూసి ముంగిస ఎంతో తృప్తి చెందింది.

పాపను రక్షించానన్న ఆనందంతో ముంగిస పాప తల్లి రమణమ్మ కోసం వాకిట్లోకి వెళ్ళి ఎదురు చూస్తోంది. అంతలో రమణమ్మ భుజాన బిందెను ఎత్తుకుని ఇంట్లోకి వచ్చింది. ముంగిస ఆమె కాళ్ళలోకి ఎంతో ఆనందంగా దూరింది. తన కాళ్ళలోకి అడ్డుపడుతున్న ముంగిసను ఆమె చూసింది. వెంటనే ఆమె గుండె గుభేలు మన్నది. ముంగిస నోరంతా రక్తంతో తడిసివుండడం గమనించింది. భయంతో ఆమెకు



వేరే ఆలోచన రాలేదు. ముంగిస పాపనే కరిచేసి వుంటుంది అని భావించింది. దాని నోటికున్న రక్తమంతా పాప రక్తం అని అనుకున్నది. ఎర్రగా వుండడం చూచింది. ఆమెకెంతో కోపం వచ్చింది. కోపంలో ఏం చేస్తునాన్నో అని తెలియకుండా వాకిట్లోగల కర్రనొకదాన్ని తీసుకుని కోపం తీరా దాన్ని కొట్టి చంపింది.

దాన్నలా చంపేసి దు:ఖిస్తూ చరచరా లోపలకు వరుగెత్తుతూ వెళ్ళింది. ఉయ్యాలలో వున్న పాపను చూసింది. పాప చిరునవ్వు లొలికిస్తూ ఉయ్యాలలో చక్కగా ఆడుకొంటుంది. ఆ ఉయ్యాలలో ముంగిస చేతిలో చచ్చిన పాము ముక్కలు ముక్కలై పడి ఉండడం చూచింది. జరిగిందేమిటో ఆమెకు అర్ధమయ్యింది. ముగిస తమపై అభిమానంతో తన బిడ్డ ప్రాణాలాపాడిందని గ్రహించింది. ప్రాణాలు కాపాడిన ఉపకారిని తాను చంపేశానని తన పొరపాటుకు చింతించింది. పాపాత్మురాలనని బాధపడింది. తొందర పడకుండా నిదానంగా ఆలోచిస్తే ఈ దారుణం జరిగేది కాదని బాధపడింది. ఎంతటి ఆపదలోనైనా ఆవేశ పడకూడదు అని తెలుసుకున్నది. ఉపకారికి అపకారం చేసాను. ఏ పనైనా నిదానంగా ఆలోచించి చెయ్యాలి అని పశ్చాత్తాపపడింది..

అందుకే పెద్దలు ఏపని అయినా ఆలోచించి చేయాలి, తొందరపడకూడదు అని చెప్తారు. ★

**PRAPATTI SRISANNIDHANAM** Telugu Monthly **MAY 2024** **RNI NO : TELTEL12303**

# శ్రీసన్నిధి పదకేళి 3

## ఆధారాలు నిలువు:


1.దశరథుడి ఆంతరంగిక మంత్రి (4)

2.భరతుడు రామపాదుకలను ఉంచిన పట్టణం (4)

3.శ్రీమద్రామాయణంలో శ్లోకాలు ఎన్ని? (అంకెల్లో) (5)

4.సీతాదేవి ఆచూకి రామునికి ఏ పక్షి చెప్పింది? (4)

5.అష్టాదశ పురాణాలలో ఒకటి (6)



## ఆధారాలు అడ్డం:

5.గంగను భూమి తెచ్చుటకు తపస్సు చేసినది (5)

6.శ్రీరాముడు ఒకే బాణంతో ఎన్ని వృక్షములను భేదించెను (2)

7.సీతాన్వేషణ కోసం సుగ్రీవుడు వానరులకు ఎంత గడువిచ్చెను (2)

8.వాలి భార్య పేరు? (2)

9.జగన్నాథ ఆలయం ఎక్కడ (2)

10.శ్రీరామ చంద్రుడి వంశం (3)

11.రావణుని మరణం తరువాత లంక రాజు ఎవరు (5)

12.సంతానం కోసం దశరథుడు చేసిన యాగం (5)

13.ఆరవ తిథి (2)

## పోటీలో పాల్గొనండి!

## ఉచిత పత్రిక అందుకోండి!!

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి మాకు వాట్సప్ ద్వారా పంపించండి.

ఫలితాలతో ఆ నెల సంచికలో మీ పేరుతో పాటు మీరు పంపే అడ్రసుకు ప్రత్యక్షంగా ఆ నెల పత్రిక ఉచితంగా మీకు అందిస్తాము.

సరియైన జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI Title No TELTEL12303, Cell No : 9502583323, Land line No 0878-2253323
Email Id prapatti.srisannidhanam9@gmail.com.